**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 112, పేజీలు - 08




శుక్రవారం,అక్టోబర్ 23, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

# కులగణన లెక్కల సవరణకు సిద్ధం

## - సీఎం రేవంత్ కీలక ప్రకటన

- వివరాలు నమోదు కానివారు ప్రభుత్వానికి తెలియజేయాలని సూచన
- వచ్చే కేబినెట్‌లో కులగణన లెక్కలపై చర్చ
- ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చే అంశాన్ని పరిశీలిస్తామని హామీ
- ముదిరాజ్ నాయకులకు మరిన్ని అవకాశాలు కల్పిస్తామని హామీ
- పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య విగ్రహాల ఏర్పాటుకు హామీ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ముదిరాజ్ సామాజిక వర్గానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీపికబురు చెప్పారు. ముదిరాజ్ సామాజిక వర్గాన్ని బీసీ-ఏ గ్రూపులో చేర్చే అంశంపై మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం చేస్తుందని ప్రకటించారు. నిరుపేదల కోసం జీవితాలను త్యాగం చేసిన పోరాటయోధులు పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్యల విగ్రహాలను ట్యాంక్ బండ్ పరిసరాల్లో ప్రతిష్టించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన పండుగ సాయన్న ముదిరాజ్ 174వ జయంతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. పండుగ సాయన్న చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. సాయన్నపై రూపొందించిన పాటలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ముదిరాజ్ కమ్యూనిటీని బీసీ-డీ నుంచి మరో గ్రూపులోకి మార్చే అంశంపై గతంలో సరైన లెక్కలు లేవన్న కారణంగా

2లో..

# మరో 30 ఏళ్లు మీకు అధికారం రాదు

## - రాహుల్‌పై అమిత్ షా ఫైర్



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దసరా పండుగ ముందు వరకూ ఢిల్లీ నిరసనల్లో చురుగ్గా పాల్గొన్న విపక్ష నేత రాహుల్ గాంధీ ఆ తర్వాత విదేశీ పర్యటనకు వెళ్లడంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా గురువారం విమర్శలు గుప్పించారు. ముఖ్యంగా అధికారం కోసం ఢిల్లీలో ఆందోళనలు సాగిస్తున్న రాహుల్ గాంధీకి ఆ అవకాశం 30 ఏళ్ల వరకూ రాదంటూ అమిత్ షా పంచ్ లు వేశారు. రాహుల్ విదేశీ పర్యటన నేపథ్యంలో అమిత్ షా చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమవుతున్నాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు నిరసన తెలుపుతున్న తరుణంలో రాహుల్ గాంధీ విదేశీ పర్యటనకు వెళ్లారు. దీనిపై స్పందించిన హోం మంత్రి అమిత్ షా, ప్రతిపక్ష నేతను టార్గెట్ చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. రాబోయే మూడు దశాబ్దాల పాటు ఆయన పార్టీ అధికారానికి దూరంగానే ఉంటుందని షా జోస్యం చెప్పారు.

2లో..

# అట్టహాసంగా 'అలయ్ బలయ్'

- 'నషా ముక్త్ భారత్' థీమ్‌తో ఈ ఏడాది వేడుకల నిర్వహణ
- రాజకీయాలకు అతీతంగా హాజరైన వివిధ పార్టీల నేతలు
- ఐక్యతను చాటిన సాంస్కృతిక సమ్మేళనమని వక్తుల ప్రశంస



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన 'అలయ్ బలయ్' అట్టహాసంగా సాగింది. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను చాటిచెబుతూ, ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. ప్రతి ఏటా దసరా తర్వాత కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చే ఈ కార్యక్రమంలో తెలంగాణ జానపద కళారూపాలను ప్రదర్శించారు. బతుకమ్మ, బోనాలు, డప్పు, గుస్సాడీ, కోలాటం వంటి సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ ఏడాది 'నషా ముక్త్ భారత్' అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. యువతలో మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగింది. ఈ వేడుకలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం సహా పలు రాజకీయ పార్టీల నేతలు పాల్గొని సమైక్యతను చాటారు. తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

2లో..

## 100 పట్టణ స్థానిక సంస్థలకు నవంబరు 1న ఎన్నికలు

- సుప్రీంకోర్టు ఆదేశాలతో ఈసీ నిర్ణయం



**అమరావతి (ప్రశ్న న్యూస్)** సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల ప్రక్రియపై రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని 100 పట్టణ స్థానిక సంస్థలకు నవంబర్ 1న పోలింగ్ నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. నవంబర్ 3న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడిస్తామని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఈ షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు ఎన్నికల సంఘం పేర్కొంది. ఇటీవల నామినేషన్ల పర్వంలో వివాదాలు తలెత్తిన

2లో..

# పాత ఒప్పందాలను వేగవంతం చేయాలి

- సీఎం చంద్రబాబు అధ్యక్షతన 22వ ఎస్ఐపీబీ సమావేశం - గత ఒప్పందాలను ఉత్పత్తి దశకు తేవాలని సీఎం ఆదేశం
- రాష్ట్రంలో సెమీకండక్టర్ల తయారీ ఎకోసిస్టమ్‌పై దృష్టి - 714 ఒప్పందాల్లో 519 ప్రాజెక్టులు ప్రారంభమైనట్లు వెల్లడి
- పోర్టులు, ఎయిర్‌పోర్టుల అనుసంధానంపై సీఎం దిశానిర్దేశం



**అమరావతి (ప్రశ్న న్యూస్)** రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు, ఇప్పటికే కుదుర్చుకున్న పెట్టుబడి ఒప్పందాలను క్షేత్రస్థాయిలో కార్యరూపంలోకి తీసుకువచ్చి పరిశ్రమల స్థాపన, ఉత్పత్తి ప్రారంభానికి ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. కేవలం ఒప్పందాలకే పరిమితం కాకుండా, పెట్టుబడులు వాస్తవరూపం దాల్చేలా సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన 22వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశంలో వివిధ రంగాలకు చెందిన పెట్టుబడి ప్రతిపాదనలు, ప్రాజెక్టుల పురోగతిపై చర్చించారు.

### 714 ఒప్పందాల్లో 519 ప్రాజెక్టులపై కార్యాచరణ

రాష్ట్రంలో గతంలో కుదుర్చుకున్న మొత్తం 714 పెట్టుబడి ఒప్పందాల్లో 519 ప్రాజెక్టులకు సంబంధించి కార్యాచరణ ప్రారంభమైనట్లు అధికారులు సమావేశంలో వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు తదుపరి దశలకు చేరుకునేలా చూడటంతో పాటు, మిగిలిన ఒప్పందాల పురోగతిని కూడా సమీక్షించాలని సీఎం సూచించారు. పెట్టుబడిదారులకు అవసరమైన అనుమతులు, మౌలిక సదుపాయాలు, ఇతర సహకారాన్ని సమన్వయంతో అందించి ప్రాజెక్టుల అమలును వేగవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు.

### విశాఖలో అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్

భవిష్యత్తులో భారీ పెట్టుబడుల సదస్సులను

2లో..

# హైదరాబాద్‌లో గ్రీన్ వాటర్ స్టేషన్

- కోకాపేటలో ఏర్పాటు చేయడానికి జలమండలి కసరత్తు!




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లో తాగునీటి వనరులపై ఒత్తిడిని తగ్గించేందుకు జలమండలి మరో కీలక చర్యకు సిద్ధం అవుతోంది. ప్రస్తుతం ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో నగరంలో తాగునీటి కొరత రాకుండా ముందస్తు ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలోనే నిర్మాణ పనులు, పరిశ్రమలు, రోడ్ల శుభ్రత వంటి అవసరాలకు శుద్ధి చేసిన మురుగునీటిని తిరిగి వినియోగించేలా 'గ్రీన్ వాటర్' సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేయాలని హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ) యోచిస్తోంది. ఇందులో భాగంగా కోకాపేటలో ప్రత్యేక గ్రీన్ వాటర్

2లో..

# సీఎం చంద్రబాబుతో పవన్ భేటీ

## - పరిషత్ పోరుపై కీలక మంతనాలు!



**హైదరాబాద్** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు , డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భేటీ ఇప్పుడు ఏపీ పొలిటికల్ సర్కిల్స్‌లో ఆసక్తికరంగా మారింది. మామూలుగా అయితే ఇదేం పెద్ద విషయం కాకపోవచ్చు.. కానీ కాన్వాయ్, సెక్యూరిటీ లేకుండా కారులో ఒంటరిగా ఉండవల్లిలోని సీఎం నివాసానికి పవన్ వెళ్లడం హాట్ టాపిక్‌గా మారింది. కేవలం తన డ్రైవర్‌తో కలిసి వెళ్లిన పవన్ కళ్యాణ్, చంద్రబాబుతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సుమారు అరగంట పాటు వారి మధ్య చర్చలు సాగాయి. వారు రాష్ట్రంలో చోటుచేసుకున్నరాజకీయ పరిణామాలపై మాట్లాడుకున్నట్టు తెలుస్తుంది.ముఖ్యంగా స్థానిక ఎన్నికలు, రెబల్స్ సమస్య నేపథ్యంలో ఇరువురి భేటీ జరిగినట్టు తెలుస్తుంది. ఏపీలో స్థానిక ఎన్నికలు వాయిదాపై కూడా చర్చించినట్టు సమాచారం. వీటితోపాటు త్వరలో జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి తరపున అనుసరించాల్సిన వ్యూహాలు, కొన్ని నియోజకవర్గాల్లో తలెత్తిన రెబల్స్ సమస్యలను ఎలా పరిష్కరించాలనే అంశాలపై చంద్రబాబు, పవన్‌లు మాట్లాడుకున్నట్టు సమాచారం. అదేవిధంగా పవన్ కళ్యాణ్ రాజీనామా చేస్తున్నారని జరిగిన ఫేక్ ప్రచారంపై కూడా వారి మధ్య చర్చకు వచ్చినట్టు తెలుస్తుంది. అయితే పవన్ కళ్యాణ్ ఇలా సింపుల్‌గా సీఎంని వెళ్లి కలవడంపై

2లో..

# ఎల్‌నినో వల్ల విద్యుత్ కొరత రాకూడదు

## - విద్యుత్ ఉత్పత్తిని 140 మిలియన్ యూనిట్లకు పెంచాలి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఎల్‌నినో ప్రభావంతో జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గే అవకాశం, రానున్న రోజుల్లో విద్యుత్ డిమాండ్ పెరిగే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో విద్యుత్ కొరత తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. రానున్న రబీ, వేసవి సీజన్లలో వ్యవసాయ, గృహ విద్యుత్ అవసరాలను సమర్థంగా తీర్చేందుకు థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని రోజుకు 140 మిలియన్ యూనిట్లకు పెంచేలా

2లో..



# మరో 30 ఏళ్లు మీకు అధికారం రాదు

యమునా నది ప్రక్షాళన కోసం రూ. 8,941 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించిన అమిత్ షా రాహుల్ గాంధీ విదేశీ పర్యటనపై వ్యంగాస్త్రాలు సంధించారు. మీరు విదేశాల్లో ఎక్కడో కూర్చుని ఉన్నారు, నా మాటలు మీకు వినిపించవని నాకు తెలుసు. ఎందుకో కూడా మీరు చెప్పరు, కానీ ఫర్వాలేదు, అది మీ వ్యక్తిగత జీవితం కానీ మీరు ఢిల్లీలో అడుగుపెట్టాక, నా మాట వినండి, రాబోయే ముప్పై ఏళ్ల వరకు మీ వంతు రాదు," అని రాహుల్ ను ఉద్దేశించి అమిత్ షా వ్యాఖ్యానించారు. ఎస్ఐఆర్ లో జరిగిన అవకతవకలకు, అందులో జ్ఞానేష్ కుమార్ పాత్రకు వ్యతిరేకంగా ఇండియా బ్లాక్, కాక్రోచ్ జనతా పార్టీ దేశవ్యాప్తంగా నిరసనలు తెలుపుతున్న తరుణంలో రాహుల్ వియత్నాం టూర్ కు వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. దీంతో ఎప్పటిలాగే రాహుల్ విదేశీ టూర్ పై బీజేపీ నేతలు విమర్శలకు దిగుతున్నారు. ఢిల్లీ నిరసనల్లో అబద్ధాలు అరిచీ అరిచీ అలసిపోయిన గాంధీ వారసుడు సెలవుపై వెళ్లారని ఆరోపిస్తున్నారు. వియత్నాంకు వెళ్తున్న విమానంలో రాహుల్ వీడియోను ఇప్పటికకే బీజేపీ ఎక్స్ లో పోస్ట్ చేసింది. రాహుల్ విదేశీ పర్యటనల అజెండా ఏంటని కాషాయ పార్టీ ప్రశ్నలు గుప్పిస్తోంది.

# పాత ఒప్పందాలను వేగవంతం చేయాలి

నిర్వహించేందుకు వీలుగా విశాఖపట్నంలో అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యుత్తమ కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రపంచస్థాయి పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు అవసరమైన వసతులు కల్పించాల్సిన అవసరాన్ని ఆయన ప్రస్తావించారు. విశాఖను పెట్టుబడులు, పారిశ్రామిక కార్యకలాపాలు, అంతర్జాతీయ సమావేశాలకు అనువైన కేంద్రంగా అభివృద్ధి చేసే దిశగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

### రాయలసీమలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్

రాయలసీమ ప్రాంతాన్ని గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేయడంలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పన, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలు కీలక పాత్ర పోషిస్తాయని చంద్రబాబు పేర్కొన్నారు. ఉద్యానవన పంటలకు అనుబంధంగా ప్రాసెసింగ్ పరిశ్రమలు అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పంటల ఉత్పత్తి నుంచి ప్రాసెసింగ్, నిల్వ, రవాణా, మార్కెటింగ్ వరకు అవసరమైన సదుపాయాలను సమన్వయంతో అభివృద్ధి చేయడం ద్వారా ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వవచ్చన్న దిశగా ప్రభుత్వం దృష్టి సారించింది.

### లాజిస్టిక్స్‌కు ఈస్ట్--వెస్ట్ కనెక్టివిటీ కీలకం

రాష్ట్రాన్ని కీలక లాజిస్టిక్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు పోర్టులు, విమానాశ్రయాలతో పాటు ఈస్ట్--వెస్ట్ కనెక్టివిటీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. సరకు రవాణా వేగవంతం కావడానికి, పరిశ్రమలకు అవసరమైన ముడిసరుకు సరఫరా, తయారైన ఉత్పత్తుల మార్కెటింగ్ సులభతరం కావడానికి సమర్థవంతమైన రవాణా వ్యవస్థ అవసరమని స్పష్టం చేశారు. పరిశ్రమల అభివృద్ధికి అనుగుణంగా మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

### సెమీ కండక్టర్ రంగంపై ప్రత్యేక దృష్టి

సెమీ కండక్టర్ రంగంలో కేవలం ఒకటి రెండు యూనిట్ల ఏర్పాటుకే పరిమితం కాకుండా, తయారీ యూనిట్లతో కూడిన సమగ్ర ఎకోసిస్టంను రాష్ట్రంలో అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఈ రంగానికి అనుబంధంగా అవసరమైన పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు సమకూరేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.పరిశ్రమలు, ఇంధనం, పర్యాటకం, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పన తదితర రంగాలకు చెందిన పెట్టుబడి ప్రతిపాదనలపై సమావేశంలో చర్చించారు. మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, నారాయణ, కందుల దుర్గేష్ వర్చువల్‌గా సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులు పరిశ్రమల స్థాపనగా మారి, ఉత్పత్తి కార్యకలాపాలు ప్రారంభమయ్యేలా చూడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సమావేశంలో సీఎం ఇచ్చిన దిశానిర్దేశం స్పష్టం చేసింది.

# 100 పట్టణ స్థానిక సంస్థలకు నవంబరు 1న ఎన్నికలు

నేపథ్యంలో కడప, తిరుపతి కార్పొరేషన్లతో పాటు రాజంపేట, మైదుకూరు మున్సిపాలిటీలలోని కొన్ని వార్డులకు సంబంధించి తిరిగి నామినేషన్లు స్వీకరించాలని ఈసీ నిర్ణయించింది. ఈ నాలుగు పట్టణాల పరిధిలో అక్టోబర్ 23, 24 తేదీల్లో మళ్లీ నామినేషన్లు స్వీకరించనున్నట్లు పునేఠా తెలిపారు. అక్టోబర్ 25న నామినేషన్ల పరిశీలన పూర్తి చేసి, అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారని వివరించారు. తిరిగి నామినేషన్లకు అవకాశం కల్పించిన వార్డుల వివరాలను కూడా ఈసీ వెల్లడించింది. దీని ప్రకారం కడప కార్పొరేషన్‌లో 11 వార్డులు, తిరుపతి కార్పొరేషన్‌లో 18 వార్డులు, రాజంపేట మున్సిపాలిటీలో 11 వార్డులు, మైదుకూరు మున్సిపాలిటీలో 32 వార్డులకు ఈ ప్రక్రియ వర్తించనుంది. ఈ షెడ్యూల్ విడుదలతో రాష్ట్రంలో ఎన్నికల కోడ్ తక్షణమే అమల్లోకి వచ్చినట్లు ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

# అట్టహాసంగా 'అలయ్ బలయ్'

ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా హాజరైన  వెంకయ్యనాయుడు మాట్లాడుతూ ప్రకృతితో సామరస్యంగా జీవించడం అత్యంత ఆవశ్యకమని, ప్రకృతి వైపరీత్యాలను నివారించడం సాధ్యం కాదని తెలిపారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన గుర్తుచేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల మధ్య ఐక్యతను, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించే గొప్ప వేదిక 'అలయ్ బలయ్' అని ఆయన కొనియాడారు.

# హైదరాబాద్‌లో గ్రీన్ వాటర్ స్టేషన్

ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటు చేసే అవకాశాలను జలమండలి పరిశీలిస్తోంది. ఈ ప్రత్యేక గ్రీన్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్ అందుబాటులోకి వస్తే తాగడానికి ఉపయోగించే నీటిని ఇతర పనులకు వినియోగించాల్సిన అవసరం తగ్గనుంది.గ్రీన్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటుకు అనువైన పరిస్థితులను పరిశీలించేందుకు జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ కె. అశోక్‌రెడ్డి గురువారం కోకాపేటలో పర్యటించారు. అక్కడి నీటి నాణ్యత పరీక్షల ప్రయోగశాలను పరిశీలించి పరీక్షలు నిర్వహించే విధానం, పాటిస్తున్న ప్రమాణాలు, ఫలితాలను నమోదు చేసే ప్రక్రియపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. శుద్ధి చేసిన నీటిని ఇతర అవసరాలకు సరఫరా చేయాలంటే దాని నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా క్రమం తప్పకుండా నీటి పరీక్షలు నిర్వహించాలని అశోక్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జలమండలి అధికారులతో పాటు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీఎస్‌పీసీబీ) అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.నీటి నాణ్యతకు సంబంధించిన పరీక్షల ఫలితాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి సూచించారు. ఈ వివరాలను హైదరాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయం నుంచే నేరుగా పర్యవేక్షించేలా వ్యవస్థను రూపొందించాలని తెలిపారు. ఇందుకు అవసరమైన సాంకేతిక సదుపాయాలను ఏర్పాటు చేసేందుకు ఐటీ విభాగంతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు. నీటి పరీక్షల వివరాలు పారదర్శకంగా ఉండటంతో పాటు అవసరమైనప్పుడు సులభంగా అందుబాటులో ఉండేలా రికార్డులను నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దీనివల్ల నీటి నాణ్యతపై పర్యవేక్షణ మెరుగుపడటంతో పాటు సరఫరా వ్యవస్థను సమర్థంగా నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. గ్రీన్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్‌లో ట్యాంకర్లకు నీటిని నింపే విధానంపైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ప్రతి ట్యాంకర్ సామర్థ్యాన్ని బట్టి నీటి నింపే పరిమితులను నిర్ణయించాలని అశోక్‌రెడ్డి ఆదేశించారు. ఒక్కో ట్యాంకర్‌కు ఎంత నీటిని సరఫరా చేశారు.. దాని సామర్థ్యం ఎంత.. వంటి వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ట్యాంకర్లలో నిర్ణీత పరిమితికి మించి నీరు నింపకుండా నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని తెలిపారు.ఐ

అదనంగా మిగిలే నీటిని వృథా చేయకుండా సంబంధిత చెరువుకు మళ్లించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించిన సాంకేతిక ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.శుద్ధి చేసిన నీటిని తాగునీటికి ప్రత్యామ్నాయంగా కాకుండా.. తాగడానికి అవసరం లేని పనులకు వినియోగించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని జలమండలి అధికారులు చెబుతున్నారు. ఈ నీటిని నిర్మాణ రంగం, పరిశ్రమలు, రోడ్ల శుభ్రత, దుమ్ము నియంత్రణ, పార్కులు, తోటల నిర్వహణ వంటి అవసరాలకు ఉపయోగించేలా నగరప్రజలను ప్రోత్సహించాలని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ పనుల్లో తాగునీరు వినియోగించే సందర్భాలు తగ్గితే నగరంలోని తాగునీటి వనరులపై ఒత్తిడిని తగ్గించేందుకు ఉపయోగపడుతుందని చెబుతున్నారు. అయితే ఈ శుద్ధి చేసిన నీటిని ఏయే అవసరాలకు ఎంత పరిమాణంలో సరఫరా చేయాలన్నది నాణ్యత ప్రమాణాలు, భద్రతా నిబంధనలకు అనుగుణంగా నిర్ణయించాల్సి ఉంటుంది. ఫిల్లింగ్ స్టేషన్లలో నీటి నాణ్యత, సరఫరా పరిమాణం, భద్రతా ప్రమాణాలను నిరంతరం పర్యవేక్షించాలని జలమండలి స్పష్టం చేసింది. కోకాపేటలో గ్రీన్ వాటర్ కేంద్రం ఏర్పాటుపై సాంకేతిక పరిశీలన కొనసాగుతుండగా దాని ఏర్పాటు, అమలు తేదీ, సరఫరా సామర్థ్యంపై అధికారికంగా మరిన్ని వివరాలు వెల్లడించాల్సి ఉంది.

# కులగణన లెక్కల సవరణకు సిద్ధం

న్యాయస్థానాలు ఆ ప్రతిపాదనను తిరస్కరించాయని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు.

### ముదిరాజ్‌లను బీసీ-ఏ గ్రూపులో చేరుస్తాం

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన ప్రాతిపదికగా భవిష్యత్తులో న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా ముదిరాజ్‌లను గ్రూపు-ఏ లోకి మార్చడంపై మంత్రివర్గ ఉపసంఘం సమగ్రంగా అధ్యయనం చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలియజేశారు. ఈ ఉపసంఘం న్యాయనిపుణులు, అధికారులతో సంప్రదింపులు జరిపిన మీదట, మంత్రివర్గంలో చర్చించి ముదిరాజ్‌లకు న్యాయం జరిగేలా సరైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వం నిర్వహించిన కులగణనతో ఇప్పుడు బీసీల లెక్కలు పక్కాగా ఉన్నాయని, పక్కా ప్రణాళికతో సముచిత నిర్ణయం తీసుకుంటామని అన్నారు. ముదిరాజ్‌లను బీసీ-ఏ గ్రూపులో చేర్చడం ద్వారా గంగపుత్రులకు అన్యాయం జరుగుతుందన్న అనుమానాలు, అపోహలు ఉన్నాయని, అన్ని వివరాలపై ఆ వర్గాలతో చర్చించి వారిలోని అపోహలను దూరం చేయాలని ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌కి సూచించారు.

### ఆ కులగణన లెక్కలే బలహీనవర్గాలకు ధైర్యాన్నిచ్చాయి

'స్వతంత్ర భారతదేశంలో ఎవరూ చేయని పని, జనగణనలో కులగణన చేసి చూపించాం. 2024 ఫిబ్రవరి 4న కమిషన్ ఏర్పాటు చేసి సరిగ్గా ఏడాదికి 2025 ఫిబ్రవరి 4 నాటికి కులగణన లెక్కలు చేసి దేశానికి ఆదర్శంగా నిలబడ్డాం'అని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.'ఆ కులగణన లెక్కలే బలహీనవర్గాలకు ధైర్యాన్నిచ్చాయి. అడిగే హక్కును కల్పించింది. ప్రతి ఇంటి తలుపుతట్టి సమాచారాన్ని నిక్షిప్తం చేశారు. లెక్కల్లో తేడాలు ఉన్నాయని భావిస్తే, ఏదైనా కారణంతో ఎవరి వివరాలైనా నమోదు కాకపోతే, వారి వివరాలను నమోదు చేయించండి. ఒకటి అరా ఎక్కడైనా తప్పిపోతే లెక్కలను సవరించుకోవడం మన బాధ్యత. ప్రభుత్వం ఓపెన్ మైండ్ తో ఉంది. పక్కాగా లెక్కగట్టి సామాజిక న్యాయం చేయాలన్నదే ప్రభుత్వ ఆశయం. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో పక్కా న్యాయం జరగాలన్నదే లక్ష్యం' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు.

### చరిత్ర పుటల్లో పండుగ సాయన్నకు ఒక పేజీ ఉండాలి

'ఎస్సీ ఉపకులాల వర్గీకరణ కోసం చాలామంది బిడ్డలు ప్రాణాలు కోల్పోయారని, 40 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఈ సమస్యను ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిష్కరించిందని గుర్తుచేశారు. దేశంలోనే ఎస్సీ కులాల వర్గీకరణ చేపట్టి దేశానికి ఆదర్శంగా నిలబడ్డాం'అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. 'ఇలా జటిలమైన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ ముందుకు వెళుతున్నామని అన్నారు. ఆలస్యమైనా అన్యాయం జరగకుండా చూసే బాధ్యత నాది. ఈ జాతి సమస్యలపై సంపూర్ణ అవగాహన నాకుంది. నిరుపేదలు, బహుజనులకు అండగా వారి భూములను రక్షించాలని, జమీందార్లు, జాగీర్దార్లు, భూస్వాములకు వ్యతిరేకంగా పౌరుషంతో నేలకొరిగినా ఫరవాలేదని సర్వం ఒడ్డి పండుగ సాయన్న పోరాటం చేశారని కొనియాడారు. నిరుపేదలు పండుగ సాయన్న పేరును జానపదాల రూపంలో పల్లెల్లో ఇప్పటికీ స్మరిస్తారు'అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.'ఆ గొప్ప పోరాటయోధుడు పాలమూరు బిడ్డ అయినందుకు నాకెంతో గర్వకారణంగా ఉందన్నారు. జాతి మొత్తం తలెత్తుకునే విధంగా చరిత్ర పుటల్లో పండుగ సాయన్నకు ఒక పేజీ ఉండాలి. సమాజానికి ఉపయోగపడేది ఏదైనా తక్షణ నిర్ణయం తీసుకుంటాను'అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

### రెండింతలుగా సంక్షేమ పథకాలు అమలు

గత పాలకులు అమలు చేసిన సంక్షేమ పథకాలు వేటినీ రద్దు చేయకపోగా వాటిని మరింత మెరుగ్గా రెండింతలు చేసి అమలు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. 'గతంలో 2 రూపాయలకే కిలో బియ్యం పథకం ఉంటే ఇప్పుడు రాష్ట్రంలో 3.48 కోట్ల మందికి ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున సన్నబియ్యం అందిస్తున్నాం. వ్యవసాయానికి ఉచిత కరెంటిస్తే, ఇప్పుడు 200 యూనిట్ల లోపు వినియోగదారులు 55 లక్షల కుటుంబాలకు ఉచితంగా గృహవిద్యుత్ ఇస్తున్నాం'అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.'రూ. 2 లక్షలున్న రాజీవ్ ఆరోగ్యశ్రీని పరిమితిని రూ. 10 లక్షలకు పెంచాం. రైతు భరోసా రూ. 10 వేలు ఉంటే రూ. 12 వేలకు పెంచి ఇస్తున్నాం. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఆడబిడ్డలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాం. అందుకోసం ప్రభుత్వం ఇప్పటికే రూ. 14 వేల కోట్లకు పైగా వెచ్చించింది'అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. '25 లక్షలకు పైగా రైతులకు రూ. 2 లక్షల మేరకు రుణమాఫీ చేశాం. నిరుపేదలకు 8 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశాం. షాదీముబారక్, కళ్యాణ లక్ష్మి ఏ పథకం ఆపలేదు. మంచి పని ఎవరు చేసినా వాటిని మరింత మెరుగ్గా చేసి అమలు చేశామే తప్ప ఏ ఒక్కటీ ఆపలేదు' అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

### ట్యాంక్ బండ్ వద్ద పండుగ సాయన్న విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం

'సర్వాయి పాపన్న గౌడ్, దొడ్డి కొమురయ్య, కొండా లక్ష్మణ్ బాపూజీ, జ్యోతీరావు పూలే, చాకలి ఐలమ్మ ఎంతో మంది బహుజనుల కోసం పోరాడిన యోధులని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు.

కొందరు పోరాటయోధుల చరిత్రను కనుమరుగు చేశారు. జాతి కోసం జీవితాంతం తపించి, సర్వం త్యాగం చేసిన వారికి చరిత్రలో స్థానం లేకపోతే, ఈ నేల ఉన్నా లేకపోయినా ఒకటే' అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. 'సర్వాయి పాపన్న గౌడ్, జ్యోతీరావు పూలే దంపతుల విగ్రహాలు ఏర్పాటు చేసినట్టుగానే ట్యాంక్ బండ్ చుట్టూ ఉన్న ప్రాంతంలో దొడ్డి కొమురయ్య, పండుగ సాయన్న విగ్రహాలను ఏర్పాటు చేస్తాం. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్ , వాకిటి శ్రీహరి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్ , ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్ , ఈటల రాజేందర్ , సలహాదారు వీ హనుమంతరావు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబుతో పవన్ భేటీ

పొలిటికల్ సర్కిల్స్‌లో రకరకాలుగా చర్చలు జరుగుతున్నాయి. పార్టీ పనుల కోసం కాబట్టే పవన్ అన్నీ వదిలేసి వెళ్లారని ఆ పార్టీ అభిమానులు భావిస్తున్నారు. తన చర్య ద్వారా అధికారిక ఆర్భాటాల కంటే, క్లిష్ట సమయంలో చక్కటి వ్యూహంతో, ఐక్యతతో ముందుకు వెళ్లడమే ప్రాధాన్యం అనే సందేశాన్ని పవన్ కళ్యాణ్ ఇచ్చారని పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతుంది. అలాగే స్థానిక ఎన్నికలపై సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత రాష్ట్రంలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ల మీటింగ్ ప్రాధాన్యతను సంతరించుకుంది.

# ఎల్‌నినో వల్ల విద్యుత్ కొరత రాకూడదు

సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలని స్పష్టం చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో గురువారం విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, బకాయిల అంశాలపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో భట్టి విక్రమార్క సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం రోజువారీ థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సగటున 91 మిలియన్ యూనిట్లకు చేరిందని, ఇటీవల ఒక్కరోజులో 118 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి నమోదైందని అధికారులు వివరించారు. ఈ స్థాయి నుంచి ఉత్పత్తిని మరింత పెంచి రోజుకు 140 మిలియన్ యూనిట్ల లక్ష్యాన్ని చేరుకోవాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు.

### ఐదో యూనిట్‌ను ఈ నెల 20న గ్రిడ్‌కు అనుసంధానించాం

యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలోని రెండు యూనిట్లకు బొగ్గు సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా కోల్ ఇండియా లిమిటెడ్ నుంచి ప్రత్యామ్నాయ బొగ్గు సరఫరా అనుసంధానాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మార్గం ద్వారా బొగ్గు సరఫరా నవంబర్ నుంచి ప్రారంభం అవుతుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. విద్యుత్ ఉత్పత్తి పెంపులో భాగంగా యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. 'ఈ కేంద్రంలోని 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు యూనిట్లు ఇప్పటికే విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాయి. ఐదో యూనిట్‌ను ఈ నెల 20న గ్రిడ్‌కు అనుసంధానించామని, మిగిలిన సాంకేతిక, నిర్వహణపరమైన సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించి, ఐదో యూనిట్‌ను పూర్తిస్థాయి వాణిజ్య కార్యకలాపాల్లోకి తీసుకువస్తున్నాం'అని అధికారులు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకి వివరించారు.

### అక్టోబర్ 16న ఒక్కరోజులో 118 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి

'టీజీజెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాల రోజు వారీ సగటు ఉత్పత్తి 2024-25 సంవత్సరంలో 65.90 మిలియన్ యూనిట్లు, 2025-26 ఆర్థిక సంవత్సరంలో సుమారు 76.46 మిలియన్ యూనిట్లు ఉండగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అక్టోబర్ 21 నాటికి 90.97 మిలియన్ యూనిట్లకు చేరింది. 'గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రోజుకు 14.51 మిలియన్ యూనిట్ల మేర, సుమారు 19 శాతం పెరుగుదల నమోదైంది. అక్టోబర్ 16న ఒక్కరోజులో 118 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి'జరిగిందని అధికారులు తెలిపారు. 'థర్మల్ విద్యుత్ కేంద్రాల్లోని అన్ని యూనిట్లు గరిష్ఠ సామర్థ్యంతో పనిచేసేలా చూడాలని, ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్‌ను పెంచాలని, ఉత్పత్తిని రోజువారీ సమీక్షిస్తూ లక్ష్య సాధన దిశగా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి'అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు.

### మూతపడిన పరిశ్రమల విద్యుత్ బకాయిల చెల్లింపులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ అవకాశం

తెలంగాణ రాష్ట్రంలో మూతపడిన పరిశ్రమలకు పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిల చెల్లింపుల విషయంలో వన్‌టైమ్ సెటిల్‌మెంట్ విధానం ద్వారా బకాయిల చెల్లింపును సులభతరం చేసి, వినియోగదారులకు ప్రయోజనం కలిగించేలా సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచించారు.

మూతపడిన పరిశ్రమల యాజమాన్యాలతో సమన్వయం చేసుకొని, విద్యుత్ బకాయిల పరిష్కారానికి అందుబాటులో ఉన్న అవకాశాలు, నిబంధనలపై అవగాహన కల్పించాలని టీజీ ఎస్పీడీసీఎల్, టీజీఎన్పీడీసీఎల్ సీఎండీలను డిప్యూటి సిఎం ఆదేశించారు. ఈ విధానం ద్వారా అర్హత కలిగిన పరిశ్రమలకు బకాయిల చెల్లింపుల్లో కొంతమేర వెసులుబాటు లభించడంతో పాటు, విద్యుత్ పంపిణీ సంస్థలకు దీర్ఘకాలిక బకాయిల వసూళ్లకు అవకాశం కలుగుతుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు.

### రాబోయే రోజుల్లో పెరగనున్న విద్యుత్ డిమాండ్

అలాగే సింగరేణి, జెన్‌కో, ట్రాన్స్‌కో తదితర సంస్థలకు వివిధ విభాగాల నుంచి రావాల్సిన బకాయిల వసూలుకు చర్యలు చేపట్టాలని ఆర్థిక శాఖ ఉన్నతాధికారులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచించారు. రానున్న రోజుల్లో విద్యుత్ డిమాండ్ ఎంత పెరిగినా దానికి అనుగుణంగా ఉత్పత్తి, ప్రసారం, సరఫరా వ్యవస్థలను సిద్ధం చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, సింగరేణి సీఎండీ బుద్ధ ప్రకాష్ జ్యోతి, జెన్‌కో సీఎండీ హరీశ్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్, ఆర్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్, సింగరేణి డైరెక్టర్ గౌతం పోట్రు తదితరులు పాల్గొన్నారు.

# మహానగరాల్లో భారీగా పెరుగుతున్న అద్దెలు



**హైదరాబాద్,** దేశంలోని ప్రముఖ ఐటీ, వాణిజ్య మహానగరాలైన హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న ఉద్యోగులు, వలస కుటుంబాలకు అద్దె ఇళ్ల నిర్వహణ ఓ పెద్ద పీడకలగా మారుతోంది. కరోనా అనంతరం వర్క్ ఫ్రమ్ హోమ్ నిబంధనలు తొలగిపోయి, దాదాపు అన్ని ప్రైవేట్, ఐటీ కంపెనీలు వర్క్ ఫ్రమ్ ఆఫీస్ ను తప్పనిసరి చేయడంతో ఒక్కసారిగా అద్దె ఇళ్లకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. ఇదే అవకాశంగా భావించిన ఇంటి యజమానులు అడ్డగోలుగా అద్దెలు పెంచేయడమే కాకుండా, సెక్యూరిటీ డిపాజిట్ల పేరుతో భారీగా నిధులు దండుకుంటున్నారు.హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, కొండాపూర్, మాదాపూర్, తెల్లాపూర్ వంటి ఐటీ కారిడార్లలో సాధారణ ఫ్లాట్లకు కూడా గతంలో కంటే 30 నుంచి 50 శాతం వరకు అద్దెలు పెంచేశారు. ఇక బెంగళూరు పరిస్థితి మరింత దారుణంగా మారింది. అక్కడ రెండు లేదా మూడు నెలల అద్దెను డిపాజిట్‌గా తీసుకోవడానికి బదులుగా, ఏకంగా 6 నుంచి 10 నెలల అద్దెను ముందస్తు అడ్వాన్స్ లేదా సెక్యూరిటీ డిపాజిట్ గా చెల్లించాలని యజమానులు నిబంధనలు విధిస్తున్నారు. ఒక్క ఇల్లు అద్దెకు తీసుకోవాలంటేనే లక్షల్లో అడ్వాన్స్ సొమ్ము సిద్ధం చేసుకోవాల్సి రావడం సగటు మధ్యతరగతి ఐటీ ఉద్యోగి బడ్జెట్‌ను తలకిందులు చేస్తోంది.కేవలం డిపాజిట్లు మాత్రమే కాకుండా, ఖాళీ చేసి వెళ్లే సమయంలో ఇంటి యజమానులు చేసే మెయింటెనెన్స్ కోతలు, డిపాజిట్ సొమ్మును తిరిగి ఇవ్వకుండా వేధించే ఘటనలు నిత్యకృత్యమయ్యాయి. చిన్నచిన్న కారణాలు చూపిస్తూ డిపాజిట్‌లో సగానికి పైగా సొమ్మును కట్ చేసుకోవడం, పెయింటింగ్, గీతలు పడ్డాయంటూ వేలల్లో కోతలు విధించడంపై సోషల్ మీడియా వేదికగా అద్దెదారులు తమ ఆవేదనను వెళ్లగక్కుతున్నారు. ప్రభుత్వాలు తగిన అద్దె నియంత్రణ చట్టాలను పకడ్బందీగా అమలు చేయకపోవడం వల్లే యజమానుల రాక్షసానందం, ఏకపక్ష వైఖరి హద్దులు దాటుతోందని వినియోగదారుల హక్కుల సంఘాలు మండిపడుతున్నాయి.ఐటీ ఉద్యోగులు తమ జీతంలో దాదాపు 40 శాతం కేవలం అద్దెలకే వెచ్చించాల్సి వస్తోందని, దీనివల్ల పొదుపు చేసుకునే అవకాశమే లేకుండా పోతోందని ఆందోళన చెందుతున్నారు. పెరుగుతున్న అద్దెలు, అన్యాయమైన సెక్యూరిటీ డిపాజిట్ల ధోరణిని అరికట్టేందుకు ఐటీ కారిడార్లలో టెనెన్సీ యాక్ట్‌ను కఠినంగా అమలు చేయాలని, యజమానులు ఏకపక్షంగా అద్దెలు పెంచకుండా గరిష్ఠ పరిమితి విధించాలని ఐటీ సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.

# కరెంట్ పోల్ ను ఢీకొన్న కారు.. రెండు కార్లు ధ్వంసం



**మేడ్చల్** మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధి వరంగల్ జాతీయ రహదారి లో గురవుఆరం తెల్లవారుజామున కారు కరెంట్ పోల్ ను డీ కొట్టింది. దాంతో స్థంభం విరిగి కారు పై పడి రెండు కార్లు ధ్వంసం అయ్యాయి. కారు డ్రైవర్ ఆకున్ సభర్వాల్,(19) స్వల్ప గాయాలు అయ్యాయి. తెల్లవారుజామున ఘటన జరగడంతో పెను ప్రమాదం తప్పింది.

# నందలూరులో తనపై దాడి జరిగింది

**- టీడీపీ నేత ఆరోపణ**

టీడీపీ తరపున నామినేషన్ వేసేందుకు తన వర్గీయులను తీసుకెళ్తుండగా నందలూరులో గుర్తుతెలియని వ్యక్తులు తనపై దాడి చేశారని టీడీపీ అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్ రెడ్డి ఆరోపించారు. ఈ ఘటనలో గాయపడిన ఆయన చికిత్స కోసం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. దాడి సమయంలో పోలీసులు తనకు సహకరించలేదని తెలిపారు. తాను నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా వినకుండా రాళ్లు, బాటిళ్లు, మారణాయుధాలతో దాడి చేశారని ఆరోపించారు.

## గోనెగండ్ల మండల టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థిగా డాక్టర్ తిరుపతయ్య నాయుడు నామినేషన్ దాఖలు



**గోనెగండ్ల** గోనెగండ్ల మండల జడ్పీటీసీ స్థానానికి తెలుగుదేశం పార్టీ (టీడీపీ) అభ్యర్థిగా డాక్టర్ తిరుపతయ్య నాయుడు నామినేషన్ దాఖలు చేశారు. ఎమ్మెల్యే డా. బి.వి. జయనాగేశ్వర రెడ్డి ఆశీస్సులతో, కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు భాస్కర్ల చంద్రశేఖర్ సహకారంతో ఆయన నామినేషన్ ప్రక్రియను పూర్తి చేశారు.టీడీపీ నాయకత్వం సూచనల మేరకు అభ్యర్థిగా బరిలో నిలిచిన తిరుపతయ్య నాయుడు గోనెగండ్ల మండల అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, మండల నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, ఇతర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీలో చేరిన శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి

- వైయస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన గుండ లక్ష్మీదేవి , ముఖ్య అనుచరులు
- నాలుగు దశాబ్దాల టీడీపీ అనుబంధానికి స్వస్తి పలికి వైఎస్సార్‌సీపీలో చేరిక



**తాడేపల్లి** వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్ సమక్షంలో శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, ఆమె ముఖ్య అనుచరులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వైయస్ జగన్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.గుండ లక్ష్మీదేవి కుటుంబానికి తెలుగుదేశం పార్టీతో దాదాపు 40 ఏళ్ల రాజకీయ అనుబంధం ఉంది. ఆమె భర్త, దివంగత మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై, రెండుసార్లు మంత్రిగా పనిచేశారు. గుండ లక్ష్మీదేవి 2014 ఎన్నికల్లో టీడీపీ తరఫున శ్రీకాకుళం ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.గుండ లక్ష్మీదేవితో పాటు టీడీపీ నాయకులు ముద్దాడ ప్రవీణ్, జల్లు రాజీవ్, సిమ్మ నర్సింగరావు, పల్లి శ్రీనివాసరావు, కునుకు గోవింద్, గాడు సాయికుమార్, గేదెల రాంకుమార్, యాగాటి ప్రసాద్, చిన్నాల ముత్తయి నాయుడు, చెట్టు గోవింద్, గురువు శ్రీనివాస్, రౌతు నాగేశ్వరరావు వైఎస్సార్‌సీపీలో చేరారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ , మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు తో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు

## వృద్ధురాలి హత్యకేసులో నిందితుడు అరెస్టు

**విశాఖపట్నం** విశాఖపట్నంలో ఇటీవల అనుమానాస్పదంగా మృతి చెందిన వృద్ధురాలి హత్య కేసును కంచరపాలెం క్రైమ్ పోలీసులు ఛేదించారు. జీవీఎంసీ 59వ వార్డు పీఆర్ గార్డెన్స్ వద్ద ఒంటరిగా నివాసముంటున్న లాలాం శ్రీదేవి (75) హత్యకు గురయ్యారు. ఆమె పొరుగునే నివాసముంటున్న దుంప ఫాల్గుణ రావు అనే నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి సుమారు రెండున్నర తులాల బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు వృద్ధురాలి బంగారాన్ని దొంగిలించి పారిపోతుండగా, ఆమె కేకలు వేయడంతో, నోరు నొక్కి ఊపిరి ఆడకుండా చేసి హత్య చేశాడు. కేజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి, కేసును వేగంగా దర్యాప్తు చేసి ఛేదించినట్లు, ఏడీసీపీ (క్రైమ్స్ )రమ్య వెల్లడించారు...

## పోలవరం జిల్లాలో రెండో రోజు 31 ఎంపీటీసీ నామినేషన్లు

**- 60కి చేరిన మొత్తం నామినేషన్లు**

**పోలవరం** పోలవరం జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. అక్టోబర్ 22న రెండో రోజు ఎంపీటీసీ స్థానాలకు జిల్లావ్యాప్తంగా 31 నామినేషన్లు దాఖలయ్యాయి. దీంతో ఇప్పటివరకు దాఖలైన మొత్తం నామినేషన్ల సంఖ్య 60కి చేరినట్లు అధికారిక పట్టికలో పేర్కొన్నారు.జిల్లాలోని 12 మండలాల పరిధిలో 101 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మండలాల వారీగా రెండో రోజు చింతూరు మండలంలో అత్యధికంగా 12 నామినేషన్లు దాఖలయ్యాయి. దేవీపట్నంలో ఐదు, రాజవొమ్మంగిలో నాలుగు, ఏజెన్సీ గంగవరంలో మూడు, అడ్డతీగల, మారేడుమిల్లి, రంపచోడవరం మండలాల్లో రెండేసి, వీఆర్ పురంలో ఒక నామినేషన్ నమోదైంది. మిగిలిన నాలుగు మండలాల్లో రెండో రోజు నామినేషన్లు దాఖలు కాలేదు.నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ అక్టోబర్ 23 వరకు కొనసాగనుంది. ఎన్నికల నిబంధనల ప్రకారం అభ్యర్థులు గడువులోగా నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంది.

## కలెక్టర్ ఫొటోతో సైబర్ మోసం

**- డబ్బులు అడిగితే నమ్మొద్దు**



**నంద్యాల** జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఫొటోను దుర్వినియోగం చేస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్న సైబర్ మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. 9713588183 నంబర్ నుంచి వచ్చే సందేశాలను నమ్మి డబ్బులు బదిలీ చేయవద్దని గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అనుమానాస్పద సందేశాలు వస్తే సంబంధిత నంబర్‌ను బ్లాక్ చేసి, ఆధారాలతో పోలీసులకు లేదా సైబర్ క్రైమ్ విభాగానికి ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ మోసం నిర్ధారణ అయితే బాధ్యులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

## గ్రామాల్లో వేడెక్కిన రాజకీయాలు

- ఎన్నికల వేళ పల్లెల్లో మారుతున్న సమీకరణాలు..
- అభ్యర్థుల్లో పెరుగుతున్న ఉత్కంఠ




**బేతంచెర్ల:** స్థానిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని గ్రామాల్లో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది.నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో ఆయా గ్రామాల్లో రాజకీయ సందడి నెలకొంది.ప్రధాన పార్టీల నాయకులు అభ్యర్థుల ఎంపిక,మద్దతుదారుల సమీకరణలు, గెలుపు వ్యూహాలపై దృష్టి సారిస్తున్నారు.మరోవైపు ఆశావహులు తమకు అనుకూలంగా మద్దతు కూడగట్టుకునే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు.గ్రామాల్లోఎక్కడ చూసినా ఎన్నికల చర్చలే వినిపిస్తున్నాయి.ఏ గ్రామంలో ఎవరు బరిలోకి దిగుతారు?ఏ పార్టీ నుంచి ఎవరికి అవకాశం దక్కుతుంది?రెబల్స్‌గా ఎవరు పోటీ చేస్తారు?అన్న అంశాలు ఆసక్తి రేపుతున్నాయి.కొన్నిచోట్ల అభ్యర్థుల ఎంపికపై అసంతృప్తులు వ్యక్తమవుతుండగా,మరికొన్ని చోట్ల రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి.నామినేషన్ల ఉపసంహరణ,తుది అభ్యర్థుల జాబితా వెలువడిన తర్వాత గ్రామాల్లో రాజకీయ పరిస్థితులు మరింత స్పష్టమయ్యే అవకాశం ఉంది.

## ఆత్మకూరు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా టీడీపీ తరఫున డా. గోవిందరాజులు ఏకగ్రీవం



**ఆత్మకూరు:** ఆత్మకూరు మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ (టీడీపీ) తరఫున డా. గోవిందరాజులు ఏకగ్రీవంగా ఎంపికైనట్లు సంబంధిత ఎన్నికల అధికారి వెల్లడించారు. టీడీపీ తరఫున చైర్మన్ అభ్యర్థిగా డా. గోవిందరాజులు పేరును ఖరారు చేసినట్లు తెలిపారు.ఆత్మకూరు మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఎన్నికల అధికారుల ప్రకటనతో చైర్మన్ అభ్యర్థి ఎంపికపై స్పష్టత వచ్చింది.

## కొత్తపల్లి మండలంలో ఎంపీటీసీ నామినేషన్లు..

**- 10 మంది అభ్యర్థుల వివరాలు వెల్లడి**

**కొత్తపల్లి:** నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలంలో ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియలో భాగంగా వివిధ గ్రామాల నుంచి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అభ్యర్థులు సమర్పించిన నామినేషన్ పత్రాల్లో పేర్కొన్న వివరాల ప్రకారం టీడీపీ, వైఎస్సార్‌సీపీ, బీజేపీ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు పోటీలో నిలిచారు.గ్రామాల వారీగా అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి:దుద్యాల-2 ఎంపీటీసీ: టీడీపీ తరఫున ఈరగాళ్ల రాజు నామినేషన్ దాఖలు చేయగా, వైఎస్సార్‌సీపీ తరఫున రాజమూరి పుల్లయ్య, బంగి చిన్న లింగమ్మ నామినేషన్లు సమర్పించారు.ఎర్రమఠం ఎంపీటీసీ: వైఎస్సార్‌సీపీ తరఫున పెరుగు నాగలక్ష్మి రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు.నందికుంట ఎంపీటీసీ: వైఎస్సార్‌సీపీ తరఫున యర్రం నాగభారతి, స్వతంత్ర అభ్యర్థిగా మేడం పార్వతమ్మ నామినేషన్లు దాఖలు చేశారు.గోకవరం ఎంపీటీసీ: బీజేపీ తరఫున బోయ వేణుగోపాల్ నామినేషన్ సమర్పించారు.
శివపురం ఎంపీటీసీ: వైఎస్సార్‌సీపీ తరఫున షేక్ మహమ్మద్ గౌస్ నామినేషన్ దాఖలు చేయగా, స్వతంత్ర అభ్యర్థులుగా షేక్ మహమ్మద్ షా, షేక్ మహబూబ్ బాషా నామినేషన్లు సమర్పించారు.ఎన్నికలపై ఆసక్తికొత్తపల్లి మండలంలోని పలు ఎంపీటీసీ స్థానాల్లో వివిధ పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడంతో స్థానికంగా ఎన్నికల సందడి నెలకొంది. ఆయా గ్రామాల్లో అభ్యర్థుల మధ్య పోటీ ఎలా ఉండబోతోందన్న అంశంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.గమనిక: అందించిన జాబితాలో మొత్తం 10 మంది అభ్యర్థుల పేర్లు ఉన్నాయి. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ అనంతరం తుది పోటీదారుల వివరాలు స్పష్టమవుతాయి.

## తొలిరోజు నాలుగు ఎంపిటిసి సభ్యుల నామినేషన్లు



**సి. బెళగల్** మండల కేంద్రంలో స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో, ఆర్వో నాగిని అధ్యక్షతన, అసిస్టెంట్ ఆర్ఓలు , తాసిల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీవో రాణెమ్మ ఆధ్వర్యంలో, ఎంపిటిసి సభ్యుల ఎన్నికలకు తొలి రోజు నాలుగు నామినేషన్లు వేశారు. వివరాల్లోకి వెళితే మండల కేంద్రంలోని ఇనగండ్ల గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ ఎంపిటిసి సభ్యులుగా బలపరిచిన అడ్డాకుల కేజియ నామినేషన్ వేయగా, ఇద్దరు సభ్యులు బలపరిచారు, అదేవిధంగా అడ్డాకుల కీర్తి ఎంపిటిసికి పదవికి నామినేషన్ వేయగా ఇద్దరు సభ్యులు బలపరిచారు. వైఎస్ఆర్సిపి బలపరిచిన అభ్యర్థిగా సంధ్యపోగు నాగేశ్వరమ్మ నామినేషన్ వేయగా, ఇద్దరు సభ్యులు బలపరిచారు. అదేపటికి చెందిన సంధ్యపోగు మరియమ్మ నామినేషన్ వేయగా ఇద్దరు సభ్యులు బలపరిచారు. తొలి రోజు కేవలం యంగండ్ల గ్రామానికి చెందిన వారు మాత్రమే నామినేషన్ వేయడం విశేషం.

## మేడిగడ్డ బ్యారేజీని పేల్చేసిన కేసును ఎలా క్లోజ్ చేస్తారు?

- కరువు రేవంత్ రెడ్డి తెచ్చిందే, ఎల్ నినో వల్ల కాదు.
- ఆంధ్ర ప్రయోజనాల కోసమే,కాఫర్ డ్యాం కట్టలేదు.డ్యాం లు కూల్చడం యుద్ధనేరమే.
- డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,బిఆర్ఎస్.



కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష్?మ బ్యారేజ్ 21 అక్టోబర్ 2023 లో రవికాంత్ ఫిర్యాదు చేసి 3 ఏళ్లు దాటింది. ఇప్పటికీ ఎలాంటి చర్యలు లేవు. గాఢ నిద్రలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం.ఎల్ నినో వర్షాభావ పరిస్థితుల్లో రైతులు తీవ్ర బాధలు పడుతున్నారు.పత్తి రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారు.సి ఎం పట్టించుకోకుండా ఎల్ నినో ప్రభావం వల్ల నీరు ఇవ్వలేం అంటున్నారు.యాసంగి అసలు పంటలు వేయకండి అంటూ బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారు.తాగడానికి కూడా నీరు లేవని బెదిరిస్తున్నారు. కానీ వాస్తవాలు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ బాగుంటే ఈ కరువు వచ్చేది కాదు. కంట్రోల్డ్ ఎక్స్ ప్లోజన్ తో డిటోనేటర్లు పెట్టి పేల్చి ఉంటారని అనుమానమని అన్నారు.మేడిగడ్డ లక్ష్మి బారేజ్ లో 8 బ్లాక్ లు ఉండగా... 7 వ బ్లాక్ పిల్లర్ 20 కుంగిపోయిందిఅక్టోబర్ 21,2023 లో సాయంత్రం రవికాంత్ ఇంజనీర్ ఫిర్యాదు తో 174/2023 ఐపిసి 357 ప్రకారం కేసు నమోదు అయింది. కేసు నమోదైన వెంటనే నేర స్థలాన్ని సీజ్ చేసి క్రాక్స్ వచ్చిన పిల్లర్ దగ్గర సాంపుల్స్ సేకరించి, వీడియో రికార్డ్ చేసి, సెల్ ఫోన్ టవర్స్ లొకేషన్స్ తీసుకొని కాల్ డేటా తీసుకొని విశ్లేషించాల్సిన పరిస్థితి ఉండాలి.జియాలజీ డిపార్ట్ మెంట్ ద్వారా సీస్మిక్ డాటా సేకరించాల్సింది. భూకంపం ఏమైనా వచ్చిందా,రిక్టర్ స్కేల్ మీద రీడింగ్ ఎంత నమోదైంది అనేది తెలుసుకొని ఉండాలి. ఎందుకంటే డిటొనేటర్లు తో పేలుళ్లు జరిగినపుడు భూకంపం వచ్చినట్టుగా శబ్దం వస్తుంది.2025 లోనే ఈ కేసును అన్ డిటెక్టివ్ గా మూసేశారు. ఎవిడెన్స్ లేదని, తప్పుడు సమాచారం అని, అన్ డిటెక్టివ్ అని పోలీసిబి కేసు క్లోజ్ చేయవచ్చు. అన్ డిటెక్టివ్ అంటే పోలీసులకు కూడా ఈ కేసులో అనుమానం ఉంది. కాంట్రాక్టర్లు, సిడబ్ల్యుసి రిపోర్ట్ తీసుకున్నారా లేదా?అప్పటికీ కాళేశ్వరం వ్యతిరేకంగా మాట్లాడే కాంగ్రెస్ బిజెపి నేతలు, వారి పోల్ స్ట్రాటజిస్టుల కాల్ డాటా సేకరించారా? హోం మంత్రి రేవంత్ రెడ్డే, ఆయన దగ్గరనే లక్ష మంది పోలీసులు ఉన్నారు. సిఐడి, ఎస్.బి, ఇంటలిజెన్స్,కౌంటర్ ఇంటలిజెన్స్ అందరూ ఆయన చేతిలోనే ఉన్నారు.అయినా కేసులు అర్ధాంతరంగా మూసేశారు. ఇది క్లోజ్ చేసే కేసు కాదు. అత్యంత అధునాతన టెక్నాలజీ ఉపయోగించి విచారణ జరపాల్సిన కేసు. ఎలా క్లోజ్ చేశారు.జెనీవా ఒప్పందం ప్రకారం ఏ డ్యాం కూల్చేసినా అది యుద్ధ నేరం అని ప్రపంచ దేశాలు అంగీకరించాయి.అలాంటి యుద్ధనేరం తెలంగాణలో జరిగింది. అలాంటి కేసును ఎలా క్లోజ్ చేస్తారు.2025 తనుగుల హుజూరాబాద్ మానేరు నది మీద 35 కోట్లతో కట్టిన చెక్ డ్యాం ను దుండగులు పేల్చేశారు. ఆ కేసు కూడా విచారణ చేయకుండా ఆపేశారు. ఇదేంటని అడిగితే ఎక్స్ పర్ట్ ఒపీనియన్ కి పంపామని చెబుతున్నారు.హుస్సేమియా వాగు మీద మరోసారి పేల్చాలని పోతుంటే పోలీసులే కాంగ్రెస్ నాయకులను ఆపారు. 25 లక్షల క్యూసెక్కుల వరదను ఆపగలిగిన లక్ష్మి బ్యారేజీ.కూలిపోయే నాటికి వరద ప్రవాహం 22 లక్షల క్యూసెక్కులు మాత్రమే ఉంది అలాంపుడు ఎలా కుంగిపోతుంది.కిషన్ రెడ్డి అక్టోబర్ 3 2023న తియస్థా నది మీద కట్టిన డ్యాం ధ్వంసమైతే 70 మంది చనిపోయారు కానీ ఆయన,దీనిపై ఎన్.డి.ఎస్.ఎ కు లేఖ రాయలేదు.కానీ కేవలం మేడిగడ్డలో ఒక పిల్లర్ కుంగిపోయిందని ఎన్ డి ఎస్ ఏ కు కిషన్ రెడ్డి లేఖ రాసారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్, రేవంత్ ఫోన్ కాల్ డాటా మరియు వారి పోల్ స్ట్రాటజిస్టులు,వారితో సంబంధాలు కలిగి ఉన్న మాజీలను గుర్తించి వారి కాల్ డేటా సేకరించి విచారణ చేయాలి. కన్నెపల్లి పంప్ హౌస్ ఆన్ చేయకపోవడం వల్ల ఆంధ్రకు లాభం. క్రాప్ హోమీ డే అంటూ సి ఎం మాట్లాడడం దారుణం. సాగు నీరు లేకపోవడానికి కారణం రేవంత్ రెడ్డే. ఇప్పటికే 734 టి ఎం సిల నీరు సముద్రం లో అందులో 400 టి ఎంసి ల నీరు గత ఆగస్టు నెలలోనే కలిసాయి.కేసిఆర్ మీద కోపంతో మాత్రమే కన్నెపల్లి నీరు ఎత్తిపోయలేదు.కేటిఆర్ ,హరీష్ రావు పోరాటంతో కొంత కాలం ఎత్తిపోసి మళ్లీ ఆపేశారు.సీనియర్ రైటైర్డ్ ఇంజనీర్లు చెప్పున్న ప్రకారం, ఇప్పటికీ 1 లక్ష 15 వేల క్యూసెక్కుల నీరు గోదావరి నదిలో పారుతుంది.కేవలం 25,30 కోట్లతో మేడిగడ్డ వద్ద ఇప్పటికైనా కాఫర్ డ్యాం కడితే రోజు 1.4 టి ఎంసి నీరు ఎత్తుకోవచ్చు. కాఫర్ డ్యాం నిర్మాణానికి కేవలం 50 రోజులు పట్టేది. నీరు ఆంధ్రకు పంపడానికే కాఫర్ డ్యాం కట్టలేదని అన్నారు.

## కంచికచర్లలో కూటమి ఎంపీటీసీ అభ్యర్థుల నామినేషన్ల సందడి

- సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లండి
- కూటమి నేతలకు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పిలుపు

**కంచికచర్ల:** కంచికచర్ల మండలంలో కూటమి ఎంపీటీసీ అభ్యర్థుల నామినేషన్ల కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. కంచికచర్ల మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, మ్మెల్యే శ్రీమతి తంగిరాల సౌమ్య గారు మార్కెట్ యార్డ్ చైర్మన్ కోగంటి వెంకట సత్యనారాయణ బాబు,కూటమి నాయకులతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కూటమి అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య , రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి గ్రామంలోని ప్రజలకు వివరించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ ఫలాలను, గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ప్రజలతో మమేకమై పనిచేయాలిప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వారి అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించాలని సౌమ్య గారు సూచించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ అభ్యర్థులకు అండగా నిలవాలని, ఎన్నికల ప్రక్రియలో ప్రజలతో మమేకమై ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

**అభ్యర్థులకు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య శుభాకాంక్షలు** కంచికచర్ల మండలంలో కూటమి అభ్యర్థులందరికీ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య , ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటూ ప్రజల మద్దతు పొందేందుకు కృషి చేయాలని సూచించారు. నామినేషన్ల కార్యక్రమంలో పాల్గొన్న కూటమి నేతలు, అభ్యర్థులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం కంచికచర్ల మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల సందడికి వేదికగా నిలిచింది.

## నందికొట్కూరులో కూటమి జెండా ఎగరేద్దాం

**- కూటమి విజయమే లక్ష్యం**



**నంద్యాల** నందికొట్కూరు నియోజకవర్గంలో జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని బీజేపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు పిలుపునిచ్చారు.స్థానిక ఎన్నికల సన్నద్ధత, అభ్యర్థుల ఎంపికపై నంద్యాల పార్లమెంటు టీడీపీ ఇన్‌ఛార్జి శివానందరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే జి. జయసూర్యలతో అభిరుచి మధు చర్చించారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ఐకమత్యంతో పనిచేస్తూ కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సమిష్టి కృషితో అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించి నందికొట్కూరులో కూటమి జెండా ఎగురవేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# ప్రముఖులకు జమ్మి అందజేసిన మైలారిగూడెం సర్పంచ్ మారెడ్డి కొండల్ రెడ్డి



యాదగిరిగుట్ట(ప్రశ్న న్యూస్) విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని యాదాద్రి-భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మైలారిగూడెం గ్రామ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకులు మారెడ్డి కొండల్ రెడ్డి ప్రముఖులను మర్యాదపూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు.దసరా పండగ సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) ను కలిసి జమ్మి ఆకును అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.అదేవిధంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి దంపతులను కలిసి జమ్మిని అందజేసి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ నాయకులు కరుణాకర్, ఆకుల గణేష్, ఓరుగంటి శివకుమార్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# కమీషనర్ రంగనాధ్ కు మాతంగి పవన్ జన్మదిన శుభాకాంక్షలు



కూకట్ పల్లి(ప్రశ్న న్యూస్) హైడ్రా కమిషనర్ ఏ వి రంగనాథ్ జన్మదినం సందర్భంగా దేవరకొండ పట్టణ యువజన నాయకుడు మాతంగి పవన్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.గురువారం అయన పుట్టినరోజు సందర్బంగా అయన కార్యాలయం లో కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పవన్ మాట్లడుతూ చెరువులు, పార్క్ స్థలాల్ని కాపాడుతూ జనాల్లో తనదైన ముద్ర వేసుకొని మునుముందుకు సాగుతున్న రంగనాథ్ వృత్తిపరంగా మరింత ముందుకుసాగాలన్నారు.

# తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం

**- మాజీ మంత్రి కేటీఆర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



కాప్రా (ప్రశ్న న్యూస్ ) రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు.ఉప్పల్ నియోజకవర్గానికి సంబంధించిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాలు, పార్టీ బలోపేతం, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమన్వయంతో ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన చర్యలపై నాయకులు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ని మర్యాదపూర్వకంగా కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సమావేశంలో ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మేడ్చల్ డిపోలో నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమం



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ డిపో పరిధిలో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల నుండి ఒంటిగంట వరకు కి "డయల్ యువర్ డీఎం" కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ పరిమళ తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా మేడ్చల్, పరిసర ప్రాంతాల ప్రజలు, ప్రయాణికులు ఆర్టీసీ బస్సులకు సంబంధించిన సమస్యలు, బస్సుల రాకపోకల్లో ఇబ్బందులు, బస్సు సౌకర్యాలపై తమ అభిప్రాయాలు, ఫిర్యాదులను నేరుగా డిపో మేనేజర్ దృష్టికి తీసుకురావచ్చు అని పేర్కొన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. ఫిర్యాదులు, సమస్యల కోసం 9959226152 ఈ ఫోన్ నెంబర్ ద్వారా తమ సమస్యలను తెలియజేయాలని సూచించారు.ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, ఆర్టీసీ సేవలకు

# వజ్రపుకొత్తూరులో కూటమి కదనోత్సాహం

**- గౌతు శిరీష నాయకత్వంలో పుచ్చ శోభారాణి నామినేషన్**

**- ఎంపీటీసీ బరిలో ప్రధాన పార్టీలు.. గ్రామాల్లో మొదలైన రాజకీయ వేడి**



వజ్రపుకొత్తూరు(ప్రశ్న న్యూస్) శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలంలో ఎంపీటీసీ ఎన్నికల వేడి రాజుకుంది. మండల పరిషత్ కార్యాలయంలో వివిధ పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడంతో గ్రామస్థాయి రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. కూటమి తరఫున పుచ్చ శోభారాణి నామినేషన్ దాఖలు చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష నాయకత్వంలో కూటమి శ్రేణులు ఎన్నికల సమరానికి సిద్ధమవుతుండటంతో రాజకీయ సందడి మొదలైంది.

## కూటమి జోరు.. గెలుపే లక్ష్యంగా అడుగులు

పలాస నియోజకవర్గంలో కూటమిని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఎమ్మెల్యే గౌతు శిరీష నాయకత్వంలో పార్టీ శ్రేణులు కదులుతున్నాయి. ఈ క్రమంలో పుచ్చ శోభారాణి నామినేషన్ దాఖలు చేయడంతో కూటమి శిబిరంలో ఉత్సాహం నెలకొంది. గ్రామస్థాయిలో ప్రజల మద్దతు కూడగట్టి విజయం సాధించాలనే లక్ష్యంతో పార్టీ నాయకులు వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఎన్నికల్లో గెలుపొందడమే కాకుండా ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం కూడా ముఖ్యమని అభ్యర్థులు చెబుతున్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయడమే తమ ప్రాధాన్యమని పుచ్చ శోభారాణి పేర్కొన్నారు.

## అభివృద్ధి మంత్రంతో ఓటర్ల ముందుకు

తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలు ఎంపీటీసీ ఎన్నికల్లో కీలకంగా మారనున్నాయి. గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధులు తీసుకురావడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడటం, ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడం స్థానిక ప్రజాప్రతినిధుల ముందున్న ప్రధాన సవాళ్లు. ఈ నేపథ్యంలో అభ్యర్థులు అభివృద్ధి హామీలతో ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. మాటలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి ఎంతవరకు కృషి చేస్తారన్నదే ఓటర్లకు కీలకం కానుంది. మొత్తంగా వజ్రపుకొత్తూరు మండలంలో ఎంపీటీసీ ఎన్నికల సందడి మొదలైంది.

గౌతు శిరీష నాయకత్వంలో కూటమి వేస్తున్న అడుగులు, ఇతర పార్టీల వ్యూహాలు, గ్రామస్థాయిలో మారుతున్న రాజకీయ సమీకరణాలు రానున్న రోజుల్లో ఎన్నికల పోరును మరింత ఆసక్తికరంగా మార్చనున్నాయి.

# హైదరాబాద్‌లో 36 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

**- అక్రమంగా రైస్ మిల్లులో నిల్వచేసిన 829 బస్తాలు సీజ్!**





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో పేదలకు పంపిణీ చేయాల్సిన ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యం పక్కదారి పట్టినట్లు అధికారులు గుర్తించారు. హైదరాబాద్ సమీపంలోని ఇబ్రహీంపట్నంలో ఉన్న ఓ ప్రైవేట్ రైస్ మిల్లులో తనిఖీలు నిర్వహించి భారీగా బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. తెల్ల రేషన్ కార్డుదారులకు అందాల్సిన బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్లు పక్కా సమాచారం రావడంతో అధికారులు దాడులు చేసి బియ్యాన్ని పట్టుకుని, రైస్ మిల్ ఓనర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇబ్రహీంపట్నంలోని న్యూ బన్సాల్ రైస్ ఇండస్ట్రీస్‌లో పీడీఎస్ బియ్యం నిల్వ ఉంచినట్లు సమాచారం అందడంతో పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ బృందాలు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించాయి. ఈ తనిఖీల్లో మొత్తం 829 బస్తాల బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. వీటిలో సుమారు 50 కిలోల బరువున్న 677 బస్తాలు.. 25 కిలోల బరువున్న మరో 101 బస్తాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. అదనంగా బియ్యాన్ని అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్నట్లు అనుమానిస్తున్న టాటా లారీని కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ వాహనం నంబర్ టీఎస్ 03 యూబీ 3399గా గుర్తించారు. ఆ లారీలో మరో 51 బస్తాలు ఉన్నట్లు పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యంపై అధికారులు పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో బియ్యం పీడీఎస్ సరఫరాతో సంబంధం ఉన్న ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్ (ఎఫ్ఆర్‌కే) కలిగిన బియ్యంగా గుర్తించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం వెల్లడించింది. ప్రభుత్వ పథకం కింద అర్హులైన తెల్ల రేషన్ కార్డుదారులకు అందాల్సిన బియ్యం ప్రైవేట్ మిల్లుకు ఎలా చేరిందన్నది ఇప్పుడు కీలకంగా మారింది.

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేద కుటుంబాలకు సబ్సిడీపై ఆహార ధాన్యాలు అందిస్తారు. ఈ సరఫరా వ్యవస్థలోని బియ్యం అక్రమంగా మళ్లింపునకు గురైతే అర్హులైన లబ్ధిదారులకు నష్టం కలిగే అవకాశం ఉంటుంది. అందువల్ల ఈ బియ్యం ఎక్కడి నుంచి వచ్చింది.. ఎవరి ద్వారా మిల్లుకు చేరింది.. ప్రభుత్వ సరఫరా వ్యవస్థ నుంచి మళ్లించారా అనే అంశాలపై అధికారులు విచారణ జరుపుతున్నారు. విచారణ సందర్భంగా న్యూ బన్సాల్ రైస్ ఇండస్ట్రీస్ యజమాని గీతేశ్ బన్సాల్ ఈ బియ్యాన్ని సిద్ధిపేట జిల్లాలోని మోతె గ్రామంలో ఉన్న భారతి ఇండస్ట్రీస్ నుంచి కొనుగోలు చేసినట్లు అధికారులకు చెప్పినట్లు తెలుస్తోంది. అయితే ఆ కొనుగోలు ఎలా జరిగింది బియ్యం సరఫరా చేసిన సంస్థకు దాని మూలం గురించి ఏమైనా సమాచారం ఉందా అనే విషయాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది. ఈ వ్యవహారంలో గీతేశ్ బన్సాల్‌తో పాటు శ్రీరామ్ లోహియా, భారతి ఇండస్ట్రీస్ యజమాని నాగభూషణంపై అధికారులు ఫిర్యాదు చేశారు.తెలంగాణ పీడీఎస్ రైస్ కంట్రోల్ ఆర్డర్-2016లోని క్లాజ్ 17(ఈ) ఉల్లంఘనకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. బియ్యం అక్రమ నిల్వ, తరలింపు వెనుక ఉన్న వ్యక్తులు, సరఫరా మూలాలు, రవాణా మార్గాలపై తదుపరి విచారణ కొనసాగుతోంది. ప్రభుత్వం పేదలకు అందించే రేషన్ బియ్యం దుర్వినియోగం కాకుండా పర్యవేక్షించడం పౌరసరఫరాల శాఖకు కీలక బాధ్యత. ఈ ఘటనలో బియ్యం మూలం, కొనుగోలు పత్రాలు, రవాణా వివరాలను పరిశీలించిన తర్వాతే అక్రమ మళ్లింపు ఎలా జరిగిందనే అంశంపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

# విధ్వంసాలు సృష్టించి బాధితులుగా నటిస్తున్నారు

**వైసీపీపై మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి విమర్శలు**



మంగళగిరి(ప్రశ్న న్యూస్) విధ్వంసాలు సృష్టించి, అనంతరం బాధితులుగా నటించడమే వైకాపా రాజకీయ విధానమని మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ ఉండవల్లి శ్రీదేవి విమర్శించారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షాలపై అక్రమ కేసులు పెట్టి వేధించిన నాయకులు.. ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. గురువారం మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు.వైకాపా పాలనలో ఫ్యాక్షన్ రాజకీయాలు, అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. ప్రజలు ఆ పార్టీని 11 స్థానాలకే పరిమితం చేసినా నాయకుల వైఖరిలో మార్పు రాలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా అల్లర్లు సృష్టించేందుకు రౌడీ మూకలను రంగంలోకి దించుతున్నారని ఆరోపించారు. పుంగనూరు ఘటనలో తెదేపా కార్యకర్తలు గాయపడ్డారని, మంజునాథ్ అనే వ్యక్తి చేయి విరిగిందని పేర్కొన్నారు.

# బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో బాల కార్మికుల వ్యవహారంపై అధికారుల చర్యలు ఎక్కడ.?

**టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర**

**దేవాలయాలలో అధికారుల, సిబ్బంది నిర్లక్ష్యం హిందూ సమాజానికి ఇబ్బందిగా మారుతుంది**

**హిందూ దేవాలయాలపై ప్రభుత్వ నిర్లక్ష్యం వదలాలి, ఆలయాలలో ఖచ్చితంగా భక్తులకు ప్రసాదం అందించాలి**



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి ఆలయంలో బాల కార్మికులకు సంబంధించిన అంశంపై ప్రజా ప్రశ్న దినపత్రికలో ప్రచురితమైన 'బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో బాల కార్మికుల కలకలం' అనే వార్తా కథనంపై సంబంధిత శాఖల అధికారులు తక్షణమే స్పందించి, సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర డిమాండ్ చేశారు.ఈ విషయంపై ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' (శ) వేదికగా స్పందిస్తూ, బాలల హక్కుల పరిరక్షణలో అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆలయాల వంటి పవిత్రమైన ప్రదేశాల్లో బాలలతో పనులు చేయిస్తున్నారనే ఆరోపణలు వెలువడిన నేపథ్యంలో వాస్తవాలను వెలికితీసి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.బాల్యం అనేది విద్యాభ్యాసానికి, ఆటపాటలకు, సురక్షితమైన భవిష్యత్తుకు పునాది కావాలని, పిల్లల హక్కులకు భంగం కలిగించే ఏ చర్యనూ ఉపేక్షించరాదని ఆయన స్పష్టం చేశారు. కార్మిక శాఖ, పోలీసు శాఖ, బాలల సంక్షేమ శాఖ అధికారులు సమన్వయంతో వ్యవహరించి, బాలల పరిస్థితిని పరిశీలించి, వారికి అవసరమైన రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత కూడా. చిన్నారుల హక్కులను కాపాడేందుకు ప్రజలు, మీడియా, సంబంధిత శాఖలు కలిసి పనిచేయాలని టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర పిలుపునిచ్చారు

# పెళ్లి పీటలెక్కనున్న 'హనుమాన్' హీరో..

## తేజ సజ్జా వివాహ ముహూర్తం ఫిక్స్!



టాలీవుడ్ యువ హీరో తేజ సజ్జా త్వరలో పెళ్లి చేసుకోబోతున్నాడు. డిసెంబర్‌లో రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో తన వివాహం జరగనున్నట్లు వెల్లడించాడు. నవంబర్‌లో నిశ్చితార్థం నిర్వహించి, ఆ తర్వాతి నెలలో పెళ్లి వేడుక జరగనుంది. తనది పెద్దలు కుదిర్చిన వివాహమని, తల్లిదండ్రులే సంబంధం ఖరారు చేశారని తేజ తెలిపాడు. తన వ్యక్తిగత జీవితాన్ని ఎప్పుడూ గోప్యంగా ఉంచే తేజ.. పెళ్లి వేడుకను కూడా నిరాడంబరంగా నిర్వహించాలని నిర్ణయించుకున్నాడు. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే ఈ వేడుకకు హాజరుకానున్నారు. ఉదయ్‌పూర్‌లో వివాహం అనంతరం హైదరాబాద్‌లో రిసెప్షన్ నిర్వహించనున్నారు. తనకు కాబోయే భార్య కుటుంబానికి సినీ పరిశ్రమతో ఎలాంటి సంబంధాలు లేవని తేజ వెల్లడించాడు. వారు టెక్నాలజీ రంగంలో ఉన్నారని, ఆమె ప్రస్తుతం తన తండ్రితో కలిసి పనిచేస్తోందని చెప్పాడు. అమెరికాలో పెరిగిన ఆమెకు సినీ ప్రముఖుల ప్రపంచం, ప్రచార హడావుడి గురించి పెద్దగా పరిచయం లేదని తెలిపాడు. ఆ విషయం తనకు బాగా నచ్చిందని, పెళ్లి తర్వాత కూడా ఆమె వ్యక్తిగత జీవితానికి గోప్యత ఉండేలా చూసుకోవాలనుకుంటున్నట్లు పేర్కొన్నాడు.

తనకు కాబోయే భార్య వివరాలను మాత్రం తేజ వెల్లడించలేదు. ఆమె వ్యక్తిగత గోప్యతను కాపాడాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. 'హనుమాన్' సినిమాతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న తేజ సజ్జా.. ఆ తర్వాత 'మిరాయ్'తోనూ ప్రేక్షకులను అలరించాడు. సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ వ్యక్తిగత జీవితాన్ని మాత్రం కెరీర్‌కు దూరంగా ఉంచుతున్నాడు. ప్రస్తుతం ఆయన ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతున్న 'ది ట్రైటర్స్ తెలుగు' తొలి సీజన్‌కు హోస్ట్‌గా వ్యవహరిస్తున్నాడు.

# 'సంబరాల ఏటి గట్టు' రిలీజ్ డేట్ వివాదం..

## – నిర్మాతకు ఫోన్ చేసి వార్నింగ్!



మెగా సుప్రీమ్ హీరో సాయి దుర్గా తేజ్ నటిస్తున్న పాన్-ఇండియా చిత్రం 'సంబరాల ఏటి గట్టు' విడుదల తేదీ వ్యవహారం టాలీవుడ్‌లో తీవ్ర సంచలనంగా మారింది. బ్లాక్‌బస్టర్ హిట్ 'హనుమాన్' తర్వాత ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ డ్రామాను 2027 సంక్రాంతి కానుకగా జనవరిలో విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ గతంలోనే ప్రకటించింది. అయితే ఈ విడుదల తేదీపై అప్పుడే వివాదాలు తలెత్తడం సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. సంక్రాంతి బరిలో సినిమాను దింపుతామని ప్రకటించినప్పటి నుంచి తమకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయని నిర్మాత చైతన్య రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సంక్రాంతి సీజన్ కాకుండా వేరే తేదీ కనిపించలేదా అంటూ కొందరు ఫోన్ చేసి తమను నిలదీశారని, అంతేకాకుండా ఆ తేదీకి సినిమా ఎలా విడుదల చేస్తారో చూస్తామంటూ పరోక్షంగా హెచ్చరికలు, ఒత్తిళ్లకు పాల్పడ్డారని ఆయన వెల్లడించారు.భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఇలాంటి పెద్ద సినిమాల మధ్య పోటీ సహజమే అయినప్పటికీ, విడుదల తేదీల విషయంలో తెరవెనుక జరుగుతున్న ఈ రకమైన ఒత్తిళ్లు మరియు బెదిరింపులు ఇండస్ట్రీలో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఏది ఏమైనప్పటికీ, అన్ని సవాళ్లను ఎదుర్కొని అనుకున్న తేదీకే తమ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని మేకర్స్ గట్టి పట్టుదలతో ఉన్నారు. మరి ఈ వివాదం ముందెలాంటి పరిణామాలకు దారితీస్తుందో చూడాలి.

# మిక్స్‌డ్ టాక్‌ను తట్టుకుని దూసుకుపోతున్న 'రణబాలి'

## – బ్రేక్‌ఈవెన్ దిశగా అడుగులు!




టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మిక మందన్న కాంబినేషన్‌లో తెరకెక్కిన మోస్ట్ అవేటెడ్ హిస్టారికల్ యాక్షన్ డ్రామా 'రణబాలి' బాక్సాఫీస్ వద్ద ఊహించని స్థాయిలో సంచలనాలు సృష్టిస్తోంది. దసరా పండుగ కానుకగా అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమాకు మొదటి రోజు ప్రీమియర్లు మరియు మార్నింగ్ షోల నుంచి మిశ్రమ స్పందన లభించింది. కథాకథనాల విషయంలో కొన్ని విమర్శలు వినిపించినప్పటికీ, కలెక్షన్ల పరంగా మాత్రం ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి తగ్గేదేలే అన్నట్లుగా దూసుకుపోతుండటం విశేషం. ఇక విడుదలైన తొలి రోజు నుంచి టాక్‌తో సంబంధం లేకుండా రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ 'రణబాలి' హౌస్‌ఫుల్ బోర్డులతో కళకళలాడుతోంది. ముఖ్యంగా దసరా సెలవులు ఈ చిత్రానికి సంపూర్ణంగా కలిసొచ్చాయి. మంగళవారం పండుగ పూట నైజాం, ఆంధ్రా జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో థియేటర్లన్నీ ప్రేక్షకులతో కిటకిటలాడాయి. విజయ్ దేవరకొండ మరియు రష్మిక మందన్న ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీకి తోడు వారిద్దరికీ ఉన్న విపరీతమైన మాస్, యూత్ క్రేజ్ ఈ సినిమాను నిలబెట్టడంలో ప్రధాన పాత్ర పోషించాయి. ట్రేడ్ వర్గాల నుంచి అందుతున్న ప్రాథమిక సమాచారం ప్రకారం, ఈ చిత్రం ఇప్పటికే తన టోటల్ ప్రీ-రిలీజ్ బిజినెస్‌లో సుమారు 70 శాతానికి పైగా రికవరీ సాధించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలో సినిమా ఇప్పటికే బ్రేక్‌ఈవెన్ దాటి క్లీన్ హిట్ స్టేటస్‌ను సొంతం చేసుకుని లాభాల బాట పట్టగా, నైజాం మరియు ఓవర్సీస్ మార్కెట్లలోనూ ఇదే జోరు కొనసాగుతోంది. వీకెండ్ ముగిసేలోగా మిగిలిన అన్ని ప్రధాన ఏరియాల్లోనూ బ్రేక్‌ఈవెన్ సాధించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని ట్రేడ్ పండితులు విశ్లేషిస్తున్నారు. ఇక ఈ సినిమా ప్రమోషన్ల విషయంలో విజయ్, రష్మిక ప్రత్యేక శ్రద్ధ పెట్టడం కూడా కలెక్షన్లపై తీవ్ర ప్రభావం చూపింది. ఇది కేవలం ఒక కమర్షియల్ ఎంటర్‌టైనర్ మాత్రమే కాకుండా, చరిత్రలోని ఒక అరుదైన మరియు బలమైన నేపథ్యాన్ని ఆవిష్కరించే ప్రయత్నమని ప్రమోషన్లలో వారు బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఆ వినూత్న ప్రచార శైలి కారణంగా ప్రేక్షకులు థియేటర్ల వైపు క్యూ కట్టేలా చేయడంలో మేకర్స్ పూర్తిగా సఫలమయ్యారనే చెప్పాలి. అధికారిక లెక్కలు ఇంకా రావాల్సి ఉన్నప్పటికీ, ట్రేడ్ అంచనాల ప్రకారం 'రణబాలి' ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ.60 కోట్ల నుంచి రూ.70 కోట్ల వరకు గ్రాస్ వసూళ్లను రాబట్టినట్లు తెలుస్తోంది. మిశ్రమ టాక్‌ను సైతం తన స్టార్ పవర్‌తో తిప్పికొట్టి, బాక్సాఫీస్ వద్ద బలమైన వసూళ్లను సాధిస్తున్న ఈ చిత్రం రానున్న రోజుల్లో లాభాల శ్రేణిని మరింత పెంచుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

# న్యూస్ ఛానెల్ వాళ్లు బ్లాక్‌మెయిల్ చేశారు..

## అనారోగ్యంతో ఉన్నా వెళ్లక తప్పలేదు: మౌళి



యూట్యూబ్ ప్రపంచం నుంచి వెండితెరకు వచ్చి 'లిటిల్ హార్ట్స్' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న యువ నటుడు మౌళి తనుజ్ ప్రశాంత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సినిమా విజయం తర్వాత తాను పరిశ్రమలో అసూయ, ద్వేషం, ప్రతికూలతను ఎదుర్కొన్నానని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాదు, ఓ ప్రముఖ వార్తా ఛానెల్ ప్రతినిధులు తనను కార్యక్రమానికి రావాలని ఒత్తిడి చేయడంతో పాటు, రాకపోతే భవిష్యత్తులో తన సినిమాలపై ప్రభావం చూపిస్తామని బెదిరించినట్లు ఆరోపించారు. తాజాగా 'దొంగ నా కొడుకు' సినిమా టీజర్ విడుదల కార్యక్రమంలో మౌళి చేసిన ఈ వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. యూట్యూబర్‌గా గుర్తింపు పొందిన మౌళి తనుజ్ ప్రశాంత్.. 'లిటిల్ హార్ట్స్' సినిమాతో హీరోగా పరిచయమయ్యారు. ఈ రొమాంటిక్ కామెడీ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకోవడంతో ఆయనకు నటుడిగా గుర్తింపు పెరిగింది. డిజిటల్ రంగం నుంచి సినిమా పరిశ్రమలోకి అడుగుపెట్టి తొలి చిత్రంతోనే విజయం సాధించడం మౌళికి మంచి అవకాశాలను తెచ్చిపెట్టింది. అయితే, ఈ విజయం వెనుక కొన్ని చేదు అనుభవాలు కూడా ఉన్నాయని ఆయన తాజాగా వెల్లడించారు. పరిశ్రమలోకి వచ్చిన ఈ కొద్ది కాలంలోనే తాను ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నానని చెప్పారు. తనపై కొందరు ఎందుకు ప్రతికూలంగా వ్యవహరించారో ఇప్పుడే పూర్తిగా వివరించలేనని, అయితే తనను తీవ్రంగా బాధించిన ఓ సంఘటన గురించి మాత్రం చెప్పాలనుకుంటున్నానని పేర్కొన్నారు. మౌళి చెప్పిన వివరాల ప్రకారం.. 'లిటిల్ హార్ట్స్' విడుదలై విజయం సాధించిన తర్వాత ఓ ప్రముఖ వార్తా ఛానెల్ నుంచి ఆయనకు ఫోన్ వచ్చింది. తమ ఛానెల్ నిర్వహించే కార్యక్రమానికి అతిథిగా రావాలని ఆహ్వానించారు. అయితే ఆ సమయంలో తన ఆరోగ్యం బాగోలేకపోవడంతో కార్యక్రమానికి హాజరు కాలేనని మర్యాదపూర్వకంగా చెప్పినట్లు మౌళి వెల్లడించారు.కానీ, తాను రాలేనని చెప్పినప్పటికీ ఛానెల్ ప్రతినిధులు అంగీకరించలేదని ఆయన ఆరోపించారు. కార్యక్రమానికి రాకపోతే భవిష్యత్తులో తన సినిమాలపై ప్రభావం చూపిస్తామనే విధంగా మాట్లాడారని, దీంతో తాను తీవ్ర ఒత్తిడికి గురయ్యానని తెలిపారు. పెద్ద మీడియా సంస్థల నుంచి ఇలాంటి ఒత్తిడి ఎదురైతే కొత్తగా పరిశ్రమలోకి వచ్చిన నటులు భయపడతారని మౌళి వ్యాఖ్యానించారు. ఆ సమయంలో తాను కూడా భయాందోళనకు గురయ్యానని, తన కెరీర్‌కు ఎక్కడ ఇబ్బంది వస్తుందోనని ఆలోచించానని చెప్పారు. చివరకు చేసేదేమీ లేక, ఆరోగ్యం బాగోలేకపోయినా ఆ కార్యక్రమానికి వెళ్లాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. సినిమా పరిశ్రమలో తనకంటూ ఒక లక్ష్యం ఉందని, ఇక్కడ కొనసాగాలంటే కొన్ని ఇబ్బందులను ఎదుర్కొంటూ ముందుకు సాగాల్సి వస్తోందని మౌళి భావోద్వేగంగా మాట్లాడారు. ఆయన చేసిన ఆరోపణలపై సామాజిక మాధ్యమాల్లో చర్చ మొదలైంది. అయితే, మౌళి ఆరోపించిన ఛానెల్ పేరు ఈ వివరాల్లో వెల్లడించలేదు.

# సినిమా లవర్స్‌కు గుడ్ న్యూస్..

## హైదరాబాద్‌లో మరో సరికొత్త ఐమ్యాక్స్!




సినిమా ప్రేమికులకు హైదరాబాద్ నగరంలో మరో అదిరిపోయే గుడ్ న్యూస్ అందింది. టాలీవుడ్‌లో బిగ్ స్క్రీన్ సినిమా అనుభూతిని మరింత పెంచేందుకు ప్రముఖ నిర్మాణ సంస్థ అపర్ణా సినిమాస్ ముందుకొచ్చింది. ఇందులో భాగంగా నగరంలోని ప్రముఖ ఐటీ కారిడార్ అయిన విప్రో సర్కిల్ దగ్గర ఒక భారీ మల్టీప్లెక్స్‌ను నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తుంది.తాజా సమాచారం ప్రకారం, ఈ మల్టీప్లెక్స్ ఏకంగా 12 స్క్రీన్లతో అత్యాధునిక హంగులతో రూపుదిద్దుకోనుంది. ముఖ్యంగా ఇందులో ఒక అడ్వాన్స్‌డ్ ఐమ్యాక్స్ స్క్రీన్ కూడా ఉండబోతుండటం విశేషం. ఇప్పటికే హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్ ప్రాంతంలో ఏఎంబీ విక్టరీ ఐమ్యాక్స్ మరికొన్ని రోజుల్లో ప్రారంభం కాబోతుండగా.. ఇప్పుడు తాజాగా విప్రో సర్కిల్ వద్ద కూడా మరో ఐమ్యాక్స్ రానుండటం సినీ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది.ఒకవైపు ఆర్టీసీ క్రాస్ రోడ్స్, మరోవైపు విప్రో సర్కిల్ ప్రాంతంలో ఇలాంటి అత్యాధునిక స్క్రీన్లు వస్తుండటంతో, బిగ్ స్క్రీన్ సినిమా ఎక్స్‌పీరియన్స్‌కు హైదరాబాద్ నిజంగానే ప్రధాన అడ్డాగా మారుతోంది. ఈ పరిణామాలు టాలీవుడ్ ప్రేక్షకులలో, ముఖ్యంగా గూస్‌బంప్స్ తెప్పించే భారీ విజువల్స్ కోరుకునే ఫ్యాన్స్‌లో అంచనాలను విపరీతంగా పెంచేస్తున్నాయి.

# 'రామాయణ'ను 3డీలోనే చూడండి..

## – ప్రేక్షకులకు సాయిపల్లవి ప్రత్యేక విజ్ఞప్తి!




భారతీయ ఇతిహాస గాథ రామాయణాన్ని వెండితెరపై అత్యంత భారీ స్థాయిలో ఆవిష్కరించేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది. బాలీవుడ్ స్టార్ రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతాదేవిగా, యశ్ రావణుడిగా నటిస్తున్న ఈ పౌరాణిక చిత్రం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రముఖ నిర్మాత నమిత్ మల్హోత్రా నిర్మాణంలో, నితేశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం 2026 నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తాజాగా తమిళ ప్రీ-రిలీజ్ కార్యక్రమంలో పాల్గొన్న సాయిపల్లవి.. ఈ సినిమాను థియేటర్లలో త్రీడీ రూపంలోనే చూడాలని ప్రేక్షకులకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. 'రామాయణ'లో సీత పాత్ర పోషిస్తున్న సాయిపల్లవి సినిమా విజువల్స్ గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. ఈ సినిమా ట్రైలర్‌ను మొబైల్ ఫోన్‌లో చూడటానికి, పెద్ద తెరపై త్రీడీలో వీక్షించడానికి చాలా తేడా ఉంటుందని ఆమె పేర్కొన్నారు. మొబైల్‌లో చూసినప్పుడు కలిగే అనుభూతి కంటే, థియేటర్లో త్రీడీ రూపంలో చూస్తే మరింత గొప్ప అనుభవం లభిస్తుందని తెలిపారు.అందుకే ప్రేక్షకులు ఈ చిత్రాన్ని థియేటర్లలోనే చూడాలని, ముఖ్యంగా త్రీడీ ప్రదర్శనను ఎంచుకోవాలని ఆమె కోరారు. రామాయణం వంటి గొప్ప ఇతిహాసాన్ని భారీ దృశ్యాలతో వెండితెరపై చూపించేందుకు చిత్రబృందం కృషి చేస్తోందని ఆమె మాటలను బట్టి అర్థమవుతోంది. నిర్మాత నమిత్ మల్హోత్రా ఈ చిత్రాన్ని రూపొందించడంలో పెట్టుకున్న లక్ష్యం గురించి కూడా సాయిపల్లవి మాట్లాడారు. రామాయణం వంటి ప్రపంచ ప్రసిద్ధ ఇతిహాసాన్ని సాధారణ స్థాయిలో తెరకెక్కించడం ఆయనకు ఇష్టం లేదని వెల్లడించారు. ఈ కథకు తగిన గొప్పదనం, స్థాయి తెరపై కనిపించాలన్నదే ఆయన ఉద్దేశమని వివరించారు.రామాయణం భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, విలువలతో ముడిపడిన ఇతిహాసం. అలాంటి కథను ప్రపంచ ప్రేక్షకులకు చేరువ చేయాలంటే కథనం, నటీనటుల అభినయం, దృశ్యరూపకల్పన వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ అవసరం. ఈ నేపథ్యంలోనే చిత్రాన్ని భారీ నిర్మాణ విలువలతో రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది.ఈ సినిమా కోసం చిత్రబృందం అందించిన పనితీరుపై తాము గర్వంగా ఉన్నామని సాయిపల్లవి పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యంత గొప్ప కథల్లో ఒకటైన రామాయణానికి న్యాయం చేసేలా సినిమాను రూపొందించామని ఆమె అభిప్రాయపడ్డారు.

ఈ చిత్రాన్ని కుటుంబ సభ్యులతో కలిసి థియేటర్లలో వీక్షించాలని సాయిపల్లవి ప్రేక్షకులను కోరారు. ముఖ్యంగా పిల్లలను వెంట తీసుకెళ్లి త్రీడీలో సినిమా చూడాలని సూచించారు. రామాయణం కథలోని విలువలు, పాత్రలు, భావోద్వేగాలను పెద్ద తెరపై అనుభవించే అవకాశం పిల్లలకు కూడా ఉపయోగకరంగా ఉంటుందని ఆమె పిలుపు ఇచ్చారు.ఇదిలా ఉండగా, భారత్‌లో నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమాల్లో ఇదే చివరిదని సాయిపల్లవి తెలిపారు. ఇకపై చిత్రబృందం విదేశాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దీంతో సినిమా విడుదలకు ముందు అంతర్జాతీయ స్థాయిలోనూ ప్రచారాన్ని విస్తరించేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

# సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రజా వీరుడు, తెలంగాణ రాబిన్ హుడ్ గా పేరు పొందిన పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలను గురువారం సైబరాబాద్ కమిషనరేట్ లో ఘనంగా నిర్వహించారు. పేదలు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన పండుగ సాయన్న ముదిరాజ్ ధైర్యసాహసాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని సైబరాబాద్ పోలీసు అధికారులు పేర్కొన్నారు.ఆయన స్వేచ్ఛ సమానత్వం కోసం చేసిన పోరాటాలను, సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ పోలీసు కమిషనర్ డా. యం. రమేష్, డీసీపీ (అడ్మిన్) అన్నపూర్ణ, డీసీపీ (సీఏఆర్) సంజీవ్, ఏఏఓ, ఏఓతో పాటు మినిస్టీరియల్ సిబ్బంది, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రేణిగుంట జడ్పీటీసీ బరిలో పాడి మమత టీడీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు

**బి-ఫారం కేటాయించిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి కృతజ్ఞతలు**



శ్రీకాళహస్తి (ప్రశ్న న్యూస్)స్థానిక సంస్థల ఎన్నికల సమరంలో రేణిగుంట మండల జడ్పీటీసీ స్థానానికి తెలుగుదేశం పార్టీ తరఫున పాడి మమత బరిలోకి దిగారు. గురువారం కలెక్టరేట్‌లో ఆమె నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ అధిష్ఠానం తనపై నమ్మకంతో బి-ఫారం కేటాయించడంపై హర్షం వ్యక్తం చేసిన ఆమె.. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**పార్టీ నమ్మకాన్ని నిలబెడతా..**

జడ్పీటీసీ అభ్యర్థిగా అవకాశం కల్పించడం తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నానని పాడి మమత పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో ఎన్నికల్లో విజయం సాధించేందుకు సమష్టిగా కృషి చేస్తానని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల మద్దతుతో విజయం సాధించి పార్టీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, వన్నెకుల క్షత్రియ సంఘం డైరెక్టర్ సుబ్రహ్మణ్యం రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నామినేషన్ల వేళ కత్తితో హల్‌చల్

**రేణిగుంటలో తీవ్ర ఉద్రిక్తత.. టీడీపీ మాజీ ఎంపీటీసీపై కేసు**

**వైసీపీ మండల అధ్యక్షుడిపై దాడికి యత్నించారంటూ ఆరోపణలు**

**నామినేషన్ కేంద్రం వద్ద భద్రతపై ఆందోళన**



రేణిగుంట (ప్రశ్న న్యూస్) స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల వేళ తిరుపతి జిల్లా రేణిగుంటలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. నామినేషన్ల స్వీకరణ రెండో రోజున ఎంపీడీవో కార్యాలయ పరిసరాల్లో టీడీపీకి చెందిన మాజీ ఎంపీటీసీ శేషాద్రి కత్తితో సంచరించారన్న ఘటన కలకలం రేపింది. ఈ వ్యవహారంపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం.

**కత్తితో సంచారం.. అభ్యర్థుల్లో ఆందోళన**

నామినేషన్లు దాఖలు చేసేందుకు వివిధ పార్టీల అభ్యర్థులు, నాయకులు, ప్రజలు కార్యాలయానికి వస్తున్న సమయంలో శేషాద్రి కత్తితో కనిపించారని స్థానిక కథనం పేర్కొంది. ఈ ఘటనతో అక్కడున్న పలువురు ఆందోళనకు గురైనట్లు తెలిపింది. నామినేషన్ల కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు ఉన్నప్పటికీ ఇలాంటి ఘటన చోటుచేసుకోవడంపై చర్చ జరిగింది.

**వైసీపీ నేతల ఆరోపణలు**

తమ పార్టీ మండల అధ్యక్షుడిని లక్ష్యంగా చేసుకుని దాడి చేసే ఉద్దేశంతోనే శేషాద్రి కత్తితో వచ్చినట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణలకు సంబంధించి స్వతంత్ర నిర్ధారణ వివరాలు అందుబాటులో లేవు. ఘటనకు దారితీసిన పరిస్థితులు, దాడికి సంబంధించిన ఆరోపణల్లో వాస్తవాలపై పోలీసుల దర్యాప్తుతో స్పష్టత రావాల్సి ఉంది.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చినట్లు కథనంలో పేర్కొన్నారు. బహిరంగంగా కత్తితో సంచరించి భయాందోళనలు సృష్టించారన్న ఆరోపణలపై టీడీపీ మాజీ ఎంపీటీసీ శేషాద్రిపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. కేసు వివరాలు, తదుపరి పోలీసు చర్యలపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా సాగేందుకు ఎంపీడీవో కార్యాలయం, నామినేషన్ కేంద్రాల వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని స్థానికులు, వివిధ పార్టీల నాయకులు కోరుతున్నారు. అభ్యర్థులు ఎలాంటి భయాందోళనలు లేకుండా నామినేషన్లు దాఖలు చేసుకునే వాతావరణం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# వెంకట్ రెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఎన్నికపై వివాదం

**- వ్యక్తిగత పెత్తనం వద్దు ప్రజాస్వామ్యమే ముద్దు**

**- కాలనీవాసులకు తెలియకుండా కొత్త కమిటీ ఎలా ఏర్పాటు చేస్తారు.?**

**- ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలి : కాలనీవాసుల డిమాండ్**

**- కాలనీ సంఘం అందరిదీ నిర్ణయాలు కూడా అందరివే కావాలి**

ఉప్పల్ (ప్రశ్న న్యూస్)వెంకట్ రెడ్డి నగర్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎంపిక వ్యవహారం కాలనీలో వివాదానికి దారితీస్తోంది. కాలనీవాసులందరికీ ముందస్తు సమాచారం ఇచ్చి, పెద్దలు, కోర్ కమిటీ సభ్యులు, కాలనీవాసుల సమక్షంలో ప్రజాస్వామ్యబద్ధంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.గత ఏప్రిల్ 28న పెద్దల సమక్షంలో జరిగిన చర్చల్లో భాగంగా, ప్రస్తుత కమిటీని అక్టోబర్ నెలలో రద్దు చేసి, అక్టోబర్ 30, 2026న కాలనీవాసులందరి ఆమోదంతో నూతన కమిటీని ఏర్పాటు చేయాలని ఏకాభిప్రాయం కుదిరినట్లు కాలనీవాసులు పేర్కొంటున్నారు. అయితే, ప్రస్తుత కార్యవర్గం పదవీకాలం అక్టోబర్ 29తో ముగియనున్న నేపథ్యంలో, కాలనీవాసులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా, అందరితో చర్చించకుండా కొత్త కమిటీ పేర్లను తెరపైకి తీసుకురావడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ఏకపక్ష నిర్ణయాలు వద్దు! వెల్ఫేర్ అసోసియేషన్ అనేది ఏ ఒక్కరి వ్యక్తిగత సంస్థ కాదని, మొత్తం కాలనీ అభివృద్ధి, సంక్షేమం కోసం ఏర్పడిన సంఘమని కాలనీవాసులు స్పష్టం చేస్తున్నారు. కమిటీ ఎంపికలో కొందరి వ్యక్తిగత నిర్ణయాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా, ప్రతి కాలనీవాసికి సమాచారం అందించి, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నారు. పారదర్శకమైన విధానంలో అందరి ఆమోదంతో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**నేనే రాజు నేనే మంత్రి ధోరణికి స్వస్తి పలకాలి!**

కాలనీ సంక్షేమానికి సంబంధించిన నిర్ణయాలు కొందరి ఇష్టానుసారంగా కాకుండా, అందరి భాగస్వామ్యంతో జరగాలని కాలనీవాసులు అభిప్రాయపడుతున్నారు. ఎవరి ఆధిపత్యానికో, వ్యక్తిగత ప్రయోజనాలకో సంఘం వేదిక కాకూడదని, కాలనీవాసుల ఐక్యతను దెబ్బతీసే ఏకపక్ష నిర్ణయాలకు తావివ్వకూడదని పేర్కొంటున్నారు. ప్రజాస్వామ్య విలువలకు అనుగుణంగా ప్రతి ఒక్కరికీ సముచిత ప్రాధాన్యత కల్పించాలని కోరుతున్నారు.

**పాత కమిటీ రద్దు చేసి అందరి సమక్షంలో కొత్త కార్యవర్గం ఏర్పాటు చేయాలి**

గతంలో జరిగిన చర్చల ప్రకారం ప్రస్తుత కమిటీని రద్దు చేసి, కోర్ కమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు, కాలనీవాసుల సమక్షంలో పారదర్శకంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కమిటీలో ఎవరు ఉన్నా కాలనీ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ఉండాలని, వ్యక్తిగత ఆధిపత్యాలకు తావులేకుండా అందరినీ కలుపుకొని ముందుకు సాగాలని సూచిస్తున్నారు.

**కాలనీ అభివృద్ధే లక్ష్యం.. ఐక్యతే మన బలం..**

వెంకట్ రెడ్డి నగర్ అభివృద్ధి కోసం అందరూ ఐకమత్యంతో పనిచేయాల్సిన సమయంలో కమిటీ ఎంపిక విషయంలో విభేదాలు పెరగడం సరికాదని కాలనీవాసులు పేర్కొంటున్నారు. నూతన కమిటీ ఏర్పాటుకు సంబంధించి గతంలో కుదిరిన ఏకాభిప్రాయానికి అనుగుణంగా, అక్టోబర్ 30న అందరి సమక్షంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలని కోరుతున్నారు. కాలనీవాసుల విశ్వాసాన్ని కాపాడుతూ, పారదర్శకతకు పెద్దపీట వేసి, ప్రజాస్వామ్య పద్ధతిలో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# అరుణవర్ణంలో ఇంద్రకీలాద్రి

**- 'జై భవానీ' నామస్మరణతో విజయవాడ మార్మోగే**

**- భవానీ మాలధారులతో కిటకిటలాడుతున్న కొండ..**

**- దర్శనానికి పోటెత్తిన భక్తజనం**

**18.29 లక్షలు దాటిన దర్శనాలు**





విజయవాడ(ప్రశ్న న్యూస్) అరుణవర్ణంతో ఇంద్రకీలాద్రి శోభాయమానమైంది! ఎటుచూసినా ఎరుపు వస్త్రధారణలో భవానీ దీక్షాపరులు.. ఎటువిన్నా 'జై భవానీ.. జై జై భవానీ' నామస్మరణ.. అమ్మవారి దర్శనం కోసం గంటల తరబడి వేచిచూస్తున్న భక్తజనం.. భక్తిపారవశ్యంతో పులకిస్తున్న విజయవాడ వన్‌టౌన్ ప్రాంతం! దసరా శరన్నవరాత్రుల అనంతరం కూడా శ్రీ కనకదుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. భవానీ దీక్షలు చేపట్టిన భక్తులు పెద్ద సంఖ్యలో ఇంద్రకీలాద్రికి తరలివస్తుండటంతో కొండపై ఆధ్యాత్మిక సందడి నెలకొంది. భక్తుల రాకతో బీఆర్‌టీఎస్ రహదారిపై వాహనాలు బారులు తీరాయి. దర్శన క్యూలైన్లు కిక్కిరిసిపోవడంతో ఆలయ అధికారులు, పోలీసులు సమన్వయంతో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

**18.29 లక్షలు దాటిన దర్శనాలు..**

దసరా ఉత్సవాల సందర్భంగా అక్టోబర్ 11 నుంచి 20వ తేదీ అర్ధరాత్రి వరకు సుమారు 14.84 లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భవానీ భక్తుల రాక మరింత పెరగడంతో గురువారం సాయంత్రం 4 గంటల సమయానికి మొత్తం దర్శనాల సంఖ్య 18,29,000కు చేరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ వెల్లడించారు. గురువారం సాయంత్రం పంచహారతుల సందర్భంగా దర్శనాన్ని తాత్కాలికంగా నిలిపివేసే సమయానికి 1,32,411 మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. సాయంత్రం 6 గంటల సమయంలో అన్ని దర్శన క్యూలైన్లలో భక్తులు పెద్ద సంఖ్యలో వేచి ఉండటంతో, హారతులు జరుగుతున్న సమయంలోనూ మూడు దర్శన మార్గాల ద్వారా భక్తులకు దర్శనం కల్పించారు.
భక్తుల రద్దీని బట్టి రాత్రి 11 గంటలకు వినాయక ఆలయం వద్ద క్యూలైన్‌ను మూసివేసి, అప్పటివరకు క్యూలో ఉన్న భక్తులకు దర్శనం కల్పించేలా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.

**లడ్డూ ప్రసాదానికి భారీ డిమాండ్..**

అమ్మవారి దర్శనంతోపాటు లడ్డూ ప్రసాదాన్ని స్వీకరించేందుకు భక్తులు ఆసక్తి చూపుతున్నారు. గురువారం సాయంత్రం 4 గంటల వరకు మొత్తం 39.84 లక్షల లడ్డూలను భక్తులకు విక్రయించినట్లు ఈవో వెల్లడించారు. భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆలయ పోటులో మరో 3.30 లక్షల లడ్డూలను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు.
భక్తులకు ప్రసాదాల కొరత లేకుండా నిరంతర తయారీ, పంపిణీపై అధికారులు దృష్టి సారించారు.

**ఆకలి తీర్చే అన్నప్రసాదం.. దాహం తీర్చే మజ్జిగ**

అమ్మవారి దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉంటున్న భక్తులకు ఆహారం, తాగునీరు అందించేందుకు దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఇప్పటివరకు 8,37,385 మందికి అన్నప్రసాదం పంపిణీ చేశారు. అన్నప్రసాద భవనంలో రాత్రి 12 గంటల వరకు భోజనాలు అందించడంతోపాటు, అర్ధరాత్రి 1 గంట నుంచి తెల్లవారుజామున 4 నుంచి 5 గంటల వరకు హోల్డింగ్ ఏరియాల్లోని భక్తులకు ప్రత్యేకంగా ఆహార ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నారు.మరోవైపు అన్నప్రసాదం, లడ్డూ ప్రసాదం, తాగునీరు, మజ్జిగ, వైద్య సేవలను నిరంతరం అందుబాటులో ఉంచుతున్నారు.

# కార్తికమాసానికి క్యూ లైన్ల పటిష్ఠ నిర్వహణ

**తొక్కిసలాటకు తావులేకుండా చర్యలు**

**సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ**

**లడ్డూ విక్రయాలకు అదనపు కౌంటర్లు**

**ఈఓ శ్రీనివాసరావు ఆదేశాలు**

శ్రీశైలం(ప్రశ్న న్యూస్) కార్తికమాసంలో భక్తుల రద్దీకి అనుగుణంగా దర్శన క్యూలైన్లను పటిష్ఠంగా నిర్వహించాలని శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. తొక్కిసలాటకు ఆస్కారం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, సాధారణ భక్తులకు సర్వదర్శనం సౌకర్యవంతంగా కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.
గురువారం సాయంత్రం ఆయన సర్వదర్శనం, శీఘ్రదర్శనం, అతిశీఘ్రదర్శనం క్యూలైన్లు, ఆలయ ప్రాంగణంలోని దర్శన మార్గాలు, క్యూ కాంప్లెక్స్ కంపార్టుమెంట్లను పరిశీలించారు. అన్నప్రసాద వితరణ భవనం, లడ్డూ ప్రసాదాల విక్రయ కేంద్రాల వద్ద ఏర్పాట్లను తనిఖీ చేశారు. క్యూలైన్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, అమరికను ప్రత్యేకంగా పరిశీలించారు. రద్దీ సమయాల్లో కమాండ్ కంట్రోల్ రూము నుంచి క్యూలైన్లను నిరంతరం పర్యవేక్షించాలని ఈఓ సూచించారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.
వారాంతపు సెలవులు, పర్వదినాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. దర్శన వేళలు, వేచిఉండాల్సిన సమయాన్ని ఆలయ ప్రసార వ్యవస్థ ద్వారా భక్తులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. క్యూలైన్లలో మంచినీరు, అల్పాహారం నిరంతరాయంగా అందించాలని, క్యూ కాంప్లెక్స్‌ల్లో ఫ్యాన్లు, లైట్లు సక్రమంగా పనిచేసేలా చూడాలని ఆదేశించారు. విద్యుత్ వైరింగ్‌లో లోపాలు ఉంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. క్యూలైన్లలో ఫ్లోరింగ్‌ను తనిఖీ చేసి, దెబ్బతిన్న చోట ప్యాచ్‌వర్కులు తక్షణమే పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు.

**లడ్డూ కౌంటర్లు పెంచాలి**

లడ్డూ ప్రసాదాల కోసం భక్తులు ఎక్కువసేపు వేచి ఉండకుండా విక్రయాలను వేగవంతం చేయాలని ఈఓ ఆదేశించారు. కార్తికమాసంలో రద్దీకి అనుగుణంగా అదనపు ప్రసాద విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, మహిళల కోసం ప్రత్యేక కౌంటర్ అందుబాటులో ఉంచాలని సూచించారు.

**అన్నప్రసాదానికి వేళలు పెంపు**

కార్తికమాసంలో భక్తుల సంఖ్యకు అనుగుణంగా అన్నప్రసాద వితరణ చేపట్టాలన్నారు. ప్రతిరోజూ నిర్ణీత సమయానికి ఆలస్యం లేకుండా వితరణ ప్రారంభించాలని, అవసరమైతే మధ్యాహ్నం 3.30 గంటల వరకు కొనసాగించాలని సూచించారు. రాత్రిపూట అల్పాహార వితరణను సాయంత్రం 7 గంటల నుంచే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.
ఈ తనిఖీల్లో దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





# మీడియాను విభజించు పాలించు

- 'ఏ, బీ, సీ' క్యాడర్లతో జర్నలిస్టుల్లో చిచ్చు.. ప్రజాప్రతినిధుల ద్వంద్వ నీతి
- భజన బృందాలకే అగ్రతాంబూలం.. సీనియర్ జర్నలిస్టులకు అవమానాలా.?
- మీడియా గొంతు నొక్కే విభజన రాజకీయాలపై పాత్రికేయ వర్గాల ఆగ్రహం
- స్టేజీల పై మీడియాను పొగడడం, వెనకాల తిట్టడం ప్రజాప్రతినిధుల కొత్త ధోరణి
- సమస్యలు రాసిన రిపోర్టర్లు చెడ్డోళ్ళు, ఉదయం నుండి రాత్రి వరకు భజన చేసిన వాళ్లు మంచోళ్ళు
- జర్నలిస్టు విలువలు కనీసం అర్థం చేసుకొని కొంతమంది ప్రజాప్రతినిధులు
- జర్నలిజం పేరుతో జోకుడు, భజన బృందాలుగా మారుతున్న కొంతమంది రిపోర్టర్లు




ఉప్పల్ (ప్రశ్న న్యూస్) నియోజకవర్గంలోని ప్రజలంతా సమానమే.. అందరి సంక్షేమమే మా ధ్యేయం.. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన మీడియా అంటే మాకు ఎనలేని గౌరవం అంటూ మైకుల ముందు నీతి సూక్తులు వల్లించే నియోజకవర్గ ప్రజాప్రతినిధుల అసలు రంగు బయటపడుతోంది. వేదికలపై సమభావం అంటూ నటిస్తూనే, తెరవెనుక పచ్చి విభజన రాజకీయాలకు తెరలేపుతున్నారు. తమ స్వార్థ ప్రయోజనాలు, రాజకీయ మనుగడ కోసం పాత్రికేయ రంగాన్ని ముక్కలు ముక్కలు చేస్తున్నారు. వాళ్ల నియోజకవర్గ పరిధిలోని జర్నలిస్టులను తమకు ఉన్న అనుకూలతలను బట్టి 'ఏ', 'బీ', 'సీ' క్యాడర్లుగా విభజించి, వారి మధ్య అంతరాలు సృష్టిస్తూ బ్రిటీష్ నాటి 'విభజించి పాలించు' కుతంత్రాన్ని అమలు చేస్తుండటంపై పాత్రికేయ వర్గాల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

## భజన బృందాలకు పట్టం.. సీనియర్లకు అవమానాల పర్వం..

నియోజకవర్గంలో పనిచేసే మీడియా ప్రతినిధులను తమ అస్మదీయులు, తస్మదీయులుగా వర్గీకరిస్తూ ప్రజాప్రతినిధులు సాగిస్తున్న వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది. దశాబ్దాలుగా ప్రజా సమస్యలపై గళమెత్తుతూ, నిష్పాక్షికంగా పనిచేస్తున్న సీనియర్ పాత్రికేయులను కనీసం మనుషులుగా కూడా గుర్తించకుండా అవమానకర రీతిలో పక్కన పెడుతున్నారు. సేవ పేరుతో ఏమి చేయక కేవలం హడావిడి చేసే కొందరు నేతలు, తమ వ్యక్తిగత బలగానికి చెందిన వారికే ప్రాధాన్యతనిస్తూ వృత్తి నిబద్ధత కలిగిన పాత్రికేయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనుల సమీక్షలు లేదా అధికారిక విలేకరుల సమావేశాలు నిర్వహించినప్పుడు కొంతమంది ప్రజాప్రతినిధుల వివక్ష పారకాష్టకు చేరుతోంది. కేవలం తమకు నిత్యం భజన చేసే కొంతమంది పాత్రికేయులకే సమాచారం చేరవేస్తూ, నిజాలను నిర్భయంగా రాయడంతో పాటు ప్రజల సమస్యలపై ప్రశ్నించే చాలామంది పత్రికల విలేకరులతో పాటు చిన్న పత్రికలు, స్థానిక మీడియాను ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తున్నారు.

## ఐక్యతపై నీతులు.. ఆచరణలో చీలికల మంటలు

ఒకవైపు జర్నలిస్టుల సమావేశాల్లో మాట్లాడుతూ "మీడియా మిత్రులంతా ఐక్యంగా ఉండాలి.. సమాజ హితం కోసం పనిచేయాలి" అంటూ ఊసరవెల్లి మాటలతో పాటు సుద్దులు చెప్పే నేతలే, మరోవైపు రిపోర్టర్ల మధ్య మధ్య చిచ్చుపెట్టేందుకు ఏ, బీ, సీ వర్గాలుగా విభజించడం వారి ద్వంద్వ నీతికి నిదర్శనమని ప్రజాసంఘాలు మండిపడుతున్నాయి. పాత్రికేయుల్లో ఐక్యత ఉంటే తమ అవినీతి, అక్రమాలు, నియోజకవర్గ వైఫల్యాలు ఎక్కడ ఎండగడతారోనన్న దురుద్దేశంతోనే ఈ వర్గీకరణ డ్రామాకు కొంతమంది నేతలు తెరతీశారని జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మీడియా గొంతును నొక్కి, తమ చెప్పుచేతల్లో ఉంచుకోవాలనే ఈ నియంతృత్వ పోకడ ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టుగా మారిందని నిపుణులు హెచ్చరిస్తున్నారు జర్నలిస్టులను కేటగిరీలుగా విభజించి చూసే అహంకార వైఖరిని ప్రజాప్రతినిధులు తక్షణమే మానుకోవాలని నియోజకవర్గ జర్నలిస్టు సంఘాలు గట్టిగా హెచ్చరిస్తున్నాయి.

ప్రజాస్వామ్యంలో ప్రజల తరఫున నిలబడే ప్రతి జర్నలిస్టును సమాన దృష్టితో గౌరవించాల్సిన బాధ్యత పాలకులపై ఉందని కానీ వాళ్లకు అంత స్వచ్ఛమైన ఆలోచనలు లేవని స్పష్టం చేస్తున్నారు. ప్రజాక్షేత్రంలోనే వారి ప్రజావ్యతిరేక, మీడియా వ్యతిరేక విధానాలను ఎండగడతామని జర్నలిస్టు సంఘాలు హెచ్చరిస్తున్నాయి.

# టీడీఆర్ పోర్టల్‌లో ఆధార్ అథెంటికేషన్

**- తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) ప్రక్రియను మరింత పారదర్శకంగా, సురక్షితంగా మార్చేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. టీడీఆర్ ఆన్‌లైన్ పోర్టల్‌లో ఆధార్ ఆధారిత అథెంటికేషన్ ప్రక్రియను ప్రవేశపెడుతూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. లావాదేవీలలో జరిగే మోసాలు, నకిలీ రిజిస్ట్రేషన్లు, అనధికారిక లాగిన్‌ల వంటి అక్రమాలకు అడ్డుకట్ట వేయడమే ఈ చర్య ప్రధాన ఉద్దేశం. నూతన విధానం ప్రకారం, ఆస్తి యజమానులు, బిల్డర్లు, డెవలపర్లు టీడీఆర్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్, లాగిన్, దరఖాస్తుల సమర్పణ వంటి సేవలకు ఆధార్ ధ్రువీకరణను వినియోగించుకోవచ్చు. దీనివల్ల ఆస్తుల వివరాలను డేటాబేస్‌తో అనుసంధానం చేయడం సులభతరం కానుంది. కేవలం వినియోగదారులకే కాకుండా, డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ), గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) అధికారుల పరిపాలనాపరమైన లావాదేవీలకు కూడా ఆధార్ అథెంటికేషన్ వర్తించనుంది. దీనివల్ల రికార్డుల కచ్చితత్వం మెరుగుపడటంతో పాటు, మొత్తం ప్రక్రియలో జవాబుదారీతనం పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.కాగా, టీడీఆర్ ప్రక్రియలో ఆధార్ వినియోగాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేయలేదు. ఇది పూర్తిగా స్వచ్ఛందమని ఉత్తర్వులలో స్పష్టం చేసింది. ఆధార్ కార్డుదారుల ముందస్తు అనుమతితోనే ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఒకవేళ ఎవరైనా ఆధార్‌ను వినియోగించడానికి ఇష్టపడకపోయినా లేదా సాంకేతిక కారణాల వల్ల ఉపయోగించలేకపోయినా, వారికి ఎలాంటి సేవలను నిరాకరించబోమని ప్రభుత్వం వెల్లడించింది. అటువంటి సందర్భాల్లో పాస్‌పోర్ట్, ఓటర్ ఐడీ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డ్ లేదా ప్రభుత్వం జారీ చేసిన ఇతర ఫోటో గుర్తింపు కార్డులను ప్రత్యామ్నాయ ధ్రువీకరణ పత్రాలుగా సమర్పించవచ్చు.ఆధార్ చట్టం, సంబంధిత నిబంధనలకు లోబడే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పురపాలక శాఖ తెలిపింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియాతో సంప్రదింపులు జరిపిన అనంతరం ఈ విధానానికి ఆమోదం తెలిపినట్లు ప్రభుత్వం పేర్కొంది.

# ఎల్లంపేట మున్సిపాలిటీగా ఏర్పడినా.. ఫలితం శూన్యం

- పోటీ పడుతున్న సమస్యలు, పట్టించుకోని అధికారులు
- సమస్యలను పరిష్కరించాలి అంటూ కమిషనర్ కు విజ్ఞప్తులు
- కాంగ్రెస్ ప్రభుత్వంలో అడుగడుగునా అధికారుల నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం




మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ విస్తరణలో భాగంగా నగరం చుట్టుపక్కల కొత్తగా ఏర్పడిన సర్కిళ్ల వలన ప్రజలకు అనేక సమస్యలు ఏర్పడుతున్నాయి. పేరుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో కలిసిన సమస్యలు మాత్రం మరింత పెరిగిపోతున్నాయి. ఎందుకంటే అసలు అధికారులు సమస్యలు పట్టించుకుంటే కదా.. తీర్చాలని చిత్తశుద్ధి ఉంటే కదా.. దానికి తగ్గట్టు కాంగ్రెస్ ప్రభుత్వం సైతం నిమ్మకు నీరెత్తినట్లు ప్రజల సమస్యలను గాలికి వదిలేసిందన్న విమర్శలు ప్రజల నుండి వినిపిస్తున్నాయి. ఎల్లంపేట మున్సిపాలిటీగా పదోన్నతి పొందిన.. అభివృద్ధిలో మాత్రం వెనుకబడిందని చెప్పవచ్చు. ఎల్లంపేట మున్సిపాలిటీగా మారినప్పటి నుండి ఇప్పటికి ప్రస్తుత కమీషనర్ తో పాటు అంతకు ముందు ఇద్దరు కమీషనర్లు పని చేశారు. అయినా అభివృద్ధి మాత్రం అంతంత మాత్రమేనని విమర్శలు వినిపిస్తున్నాయి. ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలో పొంగి పొర్లుతున్న డ్రైనేజీలు.. పడకేసిన పారిశుద్ధ్యం.. తాగునీటి సమస్యలు విద్యుత్ దీపాలు లేని వైనం.. జోరుగా అక్రమ కట్టడాలు. ఇన్ని సమస్యలు ఉన్నా సమస్య ల పరిష్కారంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. ఇద్దరు కబీషనర్లు చేయని పనిని ప్రస్తుత కమీషనర్ రెడ్డి గ్రామ కార్యదర్శులను బదిలీలు చేయడం తప్ప అభివృద్ధిలో
అడుగు ముందుకు పడడం లేదని ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి.

## గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడే బాగుండే

గ్రామ పంచాయతీగా ఎల్లంపేట ఉన్నప్పుడే బాగుండేదని ఆ గ్రామ ప్రజలు పేర్కొంటున్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన వెంటనే పరిష్కారం అయ్యేవి అని పేర్కొంటున్నారు. గ్రామపంచాయతీ నుండి మున్సిపాలిటీ గా మారినప్పటి నుండి ఎక్కడి సమస్యలు అక్కడే రాజ్యమేలుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో 23వ వార్డులో చెత్త పేరుకుపోయిన పత్రికలలో కథనాలు వచ్చేవరకు అధికారులలో చలనం లేదు అంటే ఇక్కడ పరిస్థితి ఏ విధంగా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. పారిశుద్ధ్యం పడకేసిన... డ్రైనేజీలు పొంగి పొర్లుతున్న.. మంచినీటి పైపులైన్లు పగిలిపోయిన పట్టించుకునే నాధుడే ఇక్కడ కరువయ్యారు. ఒకపక్క రాష్ట్ర ముఖ్యమంత్రే మంచి నీటిని కాపాడుకోవాలి అంటూ చెప్తున్నప్పటికీ ఇక్కడ మాత్రం అవేవీ పట్టించుకోరు. 24వ వార్డులో వాటర్ పైప్ లైన్ పదేపదే దెబ్బతిని మంచినీరు వృధాగా పోయిన అటు కమీషనర్ గాని ఇటు సిబ్బంది కానీ మాకేం పట్టనట్లుగా ప్రవర్తించడం చూస్తుంటే వారు తమ విధులను ఎంత నిర్లక్ష్యం వహిస్తున్నారో ఇట్టే అర్థమవుతుంది.

## అక్రమ నిర్మాణాన్ని కూల్చి వెయ్యమంటే సీజ్ చేశారు మతలబ్ ఏమిటో.?

ఎల్లంపేటలో అక్రమంగా నిర్మాణం సాగుతున్న అరుణ గోదాంను కూల్చివేయాలి అంటూ కోటు ఆదేశాలిచ్చినా అక్కడి కమీషనర్ మాత్రం సీజ్ చేసి చేతులు దులుపుకున్నారు. మళ్లీ వారం రోజులు గడిచిందో లేదో సదరు గోదాం మళ్లీ ఓపెన్ అయింది. పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారడంతో గోదాం ను మళ్లీ ఓపెన్ చేశారు అంటూ జోరుగా ఆరోపణలు ఉన్నాయి. ఎల్లంపేట మున్సిపాలిటీలో ఒకసారి ఏసీబీ దాడులు జరిగి టౌన్ ప్లానింగ్ స్థాయి అధికారి లంచం తీసుకుంటూ పట్టుబడ్డ అధికారులలో భయం కూడా
లేకపోవడం విస్మయానికి గురిచేస్తుంది.

## ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి

ఎల్లంపేట మున్సిపాలిటీకి ఇటీవల కొత్తగా వచ్చిన కమీషనర్ కృష్ణారెడ్డి ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. డ్రైనేజీలు పొంగి పొర్లుతున్న పారిశుద్ధ్యం పడకేసిన జోరుగా అక్రమ కట్టడాలు వెలిసిన నాకేం పట్టనట్లుగా కమిషనర్ వ్యవహరించడం పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలి

పరిపాలన సౌలభ్యం కోసం గ్రామపంచాయతీలకు మున్సిపాలిటీలుగా పదోన్నతి కల్పించిన ప్రభుత్వం ఇక్కడ పూర్తిస్థాయి సిబ్బందిని నియమించకపోవడం వల్ల అభివృద్ధిలో వెనుక పడుతుందని విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామపంచాయతీ స్థాయిలో ఉన్న కార్యదర్శుల నే వినియోగించుకుంటున్నారని విమర్శలు ఉన్నాయి. ఈ విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి ఏ ఆశయం కోసం గ్రామపంచాయతీలను మున్సిపాలిటీగా తీర్చిదిద్దో ఆ ఆశయాలు నెరవేరాలంటే కొత్తగా ఏర్పడ్డ మున్సిపాలిటీలకు సరిపడా సిబ్బందిని నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

# హైడ్రాపై పోలీస్ అధికారి పాట

**- పుట్టినరోజున ఆవిష్కరించిన కమిషనర్ ఏవీ రంగనాథ్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) విధి నిర్వహణలో బాధ్యతగా ఉంటూనే, తనలోని కళతో సామాజిక చైతన్యానికి పాటుపడుతున్నారు రాంగోపాల్‌పేట పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బోడసింగి సురేశ్ కుమార్. హైదరాబాద్ నగరంలో 'హైడ్రా' రాకతో వచ్చిన మార్పును వివరిస్తూ ఆయన ఆలపించిన ఓ ప్రత్యేక గీతాన్ని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం ఆవిష్కరించారు. కమిషనర్ రంగనాథ్ జన్మదినం సందర్భంగా ఆయన చేతుల మీదుగా ఈ పాటను విడుదల చేయడం విశేషం. గతంలో హైదరాబాద్ నగరం ఎలా ఉండేది, ఆక్రమణల వల్ల వరదలతో ఎలా మునిగిపోయేది, ప్లాస్టిక్ వ్యర్థాలతో డ్రైనేజీ కాలువలు ఎలా పూడుకుపోయాయో ఈ పాటలో వివరించారు. హైడ్రా వచ్చిన తర్వాత నగరం ఎలా సురక్షితంగా మారిందనే అంశాన్ని సురేశ్ కుమార్ తన గాత్రంతో ఆకట్టుకునేలా ప్రస్తావించారు. సురేశ్ కడారి రాసిన ఈ పాటకు కల్యాణ్ కీస్ సంగీతం అందించారు.ఈ సందర్భంగా కమిషనర్ ఏవీ రంగనాథ్ మాట్లాడుతూ, సీఐ సురేశ్ కుమార్ ప్రయత్నాన్ని అభినందించారు. విధులను నిర్వర్తిస్తూనే, పాటల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావడం ప్రశంసనీయమని అన్నారు. ఇటీవల గణేశ్ ఉత్సవాల సమయంలో డీజే సౌండ్స్‌పై సురేశ్ కుమార్ పాడిన పాట మంచి అవగాహన కల్పించిందని గుర్తుచేశారు. గతేడాది కూడా కమిషనర్ రంగనాథ్ పుట్టినరోజున వలస బతుకులపై సురేశ్ కుమార్ ఓ పాటను విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మరోసారి నగర సమస్యపై తన గళాన్ని వినిపించి అందరి మన్ననలు పొందుతున్నారు.

# డిండికి నీటి తరలింపు ఆపండి

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి పాలమూరు నేతల విజ్ఞప్తి



- డిండి ప్రాజెక్టుకు పాలమూరు నుంచి నీటి తరలింపును ఆపాలని విజ్ఞప్తి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో సమావేశమైన మహబూబ్‌నగర్ నేతలు
- ప్రస్తుత విధానంతో పాలమూరు ఆయకట్టుకు ద నష్టం తప్పదని ఆందోళన
- ప్రత్యామ్నాయ మార్గంలో డిండికి నీరు సరఫరా చేయాలని సూచన
- అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ

**హైదరాబాద్,** (ప్రశ్న న్యూస్ ) డిండి ప్రాజెక్టుకు పాలమూరు ప్రాంతం నుంచి నీటిని తరలించే ప్రతిపాదనను తక్షణమే విరమించుకోవాలని మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో సమావేశమై వారు తమ ఆందోళనను వ్యక్తం చేశారు. ఈ బృందంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, సీనియర్ నేత జానా రెడ్డితో పాటు పలువురు స్థానిక ఎమ్మెల్యేలు ఉన్నారు. సుమారు గంటన్నర పాటు సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశంలో, డిండి ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ అంశాలను నేతలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తాము డిండి ప్రాజెక్టుకు నీటి సరఫరా చేయడాన్ని వ్యతిరేకించడం లేదని, అయితే ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరుల నుంచి నీటిని మళ్లిస్తే పాలమూరు ఆయకట్టుకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని వారు వివరించారు. కావున, ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా డిండి ప్రాజెక్టుకు నీటిని తరలించే అంశాన్ని పరిశీలించాలని వారు ప్రభుత్వానికి సూచించారు. పాలమూరు నేతలు వ్యక్తం చేసిన అభ్యంతరాలను, అభిప్రాయాలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సావధానంగా ఆలకించారు. ఈ విషయంపై సంబంధిత అధికారులతో సమగ్రంగా సమీక్షించి, అన్ని వర్గాలకు ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. తమ ప్రాంత ప్రయోజనాలను కాపాడాలన్న విజ్ఞప్తిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఈ సందర్భంగా నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588